


ESTD: 1999

www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ 29-03-2026 ఆదివారం | సంపుటి : 27 | సంచిక : 26 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on




# మైనింగ్‌పై సభా యుద్ధం

## మంత్రి పొంగులేటిని లక్ష్యంగా చేసుకొని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ 'అక్రమాల'పై బిఆర్ఎస్ దాడి



### పాలక ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు

**స్పీకర్ వెల్ లోకి దూసుకెళ్లిన బిఆర్ఎస్**

**సభా కమిటీ వేయాలని డిమాండ్**

**అన్ని రకాల అక్రమ మైనింగ్ ఆరోపణలపై సిబిసిఐడి విచారణకు సిఎం ఆదేశం**



- శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో అక్రమ మైనింగ్ పై మండిపాటు
- స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లిన వైనం
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిఆర్ఎస్
- ప్రతిపక్ష సభ్యులకు భట్టి, శ్రీధర్ బాబు కౌంటర్
- సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించిన సీఎం
- పొంగులేటి.. పైరవీలకు సహకరించడం లేదనే బ్లాక్ మెయిల్ రాజకీయాలు పోలీసు, ఆర్టీసీ, బీసీ సంక్షేమాన్ని కోరుతూ బీఆర్ఎస్ వాకౌట్
- ఎల్ అండ్ టీ నుంచి మెట్రో స్వాధీనానికి సీఎం తీర్మానం ప్రస్తావన
- నిరసన తెలిపిన హరీశ్ రావు
- బడ్జెట్ పద్దులపై అసెంబ్లీలో ముగిసిన చర్చ
- సభ్యులు అడిగిన ప్రశ్నలకు, లేవనెత్తిన అంశాలకు మంత్రులు, సీఎం వివరణ
- నేడు అప్రోప్రియేషన్ బిల్లుపై చర్చ
- కీలకం కానున్నచివరి రెండు రోజుల సభ

**హైదరాబాద్, మార్చి 28 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ శాసనసభ సమావేశాలు శనివారం ఆసక్తికరమైన చర్చల మధ్య కొనసాగాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై సభలో జరిగిన చర్చ శనివారంతో ముగిసింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు, లేవనెత్తిన అంశాలకు సంబంధిత మంత్రులు వివరణలు ఇచ్చారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన వివిధ శాఖల బడ్జెట్ కేటాయింపులపై అధికార, ప్రతిపక్ష సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల వినియోగంపై చర్చ జరిగింది. పద్దులపై చర్చ పూర్తి కావడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను నేడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం, నేడు సభలో అప్రోప్రియేషన్ బిల్లుపై చర్చ జరగనుంది. ఈ బిల్లు ఆమోదం పొందితేనే ప్రభుత్వం బడ్జెట్ నిధులను వెచ్చించేందుకు పూర్తిస్థాయిలో అనుమతి లభిస్తుంది. కాగా, మార్చి 30తో బడ్జెట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో, చివరి రెండు రోజులు అత్యంత కీలకం కానున్నాయి. ప్రధానంగా పెండింగ్ బిల్లులు, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలపై సభలో మరిన్ని వేడివాడి చర్చలు జరిగే అవకాశం ఉంది. శాసనసభ సమావేశాలు శనివారం ఉద్రిక్తతకు దారితీశాయి. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' వ్యవహారం సభలో పెను దుమారం రేపింది. బీఆర్ఎస్ సభ్యులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో జరుగుతున్న అక్రమాలపై చర్చ చేపట్టాలని పట్టుబట్టారు.

**మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం : సిఎం రేవంత్** 2

మిగతా 2లో

# అంగన్‌వాడీలకు సొంత భవనాలు

- వచ్చే మూడేళ్లలో పూర్తయ్యేలా ప్రణాళికలు, కార్యాచరణ
- పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- సంక్షేమం, కార్యక్రమాల అమలు గురుతర బాధ్యత అధికారులు, ఉద్యోగులదే
- ఆర్థిక వెసులుబాటుకు తగ్గట్టు సమస్యలు పరిష్కరిస్తాం
- అంగన్‌వాడీ చిన్నారులకు "తొలి ముద్ద" ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్



**హైదరాబాద్, మార్చి 28 (ఎఎంఎస్) :** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో కాకుండా వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవాల్లో కొనసాగేలా కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. శనివారం శాసనసభ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం "తొలి ముద్ద"ను సీఎం లాంఛనంగా ప్రారంభించారు.

మిగతా 2లో

# కేంద్రానికి మెట్రో విస్తరణ ప్రతిపాదనలు

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్-2 హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కు మెట్రో నెట్ వర్క్
- విస్తరణకు అడ్డంకులను, ఎదురవుతున్న ఇబ్బందులపై సమీక్ష
- ఫేజ్ 1ను హెచ్‌ఎంఆర్‌ఎల్ ద్వారా స్వాధీనం చేసుకునే నిర్ణయానికి అసెంబ్లీ ఆమోదం



2



## ఆయిల్ సంక్షోభ తరుణంలో 'ఇథనాల్ రైతుల' పాత్ర గొప్పది

**పెట్రోల్ లో ఇథనాల్ కలుపడం వల్ల రూ. 1.5 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అవుతుంది : నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ వల్ల తలెత్తుతున్న సవాళ్లను భారతదేశం పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం తెలిపారు. జేవార్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, దేశ పౌరుల రక్షణ కోసం ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో సంఘర్షణ ఒక నెలరోజులుగా నడుస్తోంది. యుద్ధం కారణంగా, ఆహారం, పెట్రోల్, డీజిల్, గ్యాస్, బొగ్గు సహా ఇతర నిత్యావసర వస్తువుల సరఫరాపై ప్రభావం నడిచింది. నలువైపులా సంక్షోభం ఆవహించి ఉంది, ప్రతి దేశం దానిని ఎదుర్కొనేందుకు యత్నిస్తోంది. మన భారతదేశం కూడా తన పౌరుల శక్తిని నమ్ముకొని, తన సర్వశక్తులతో ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని మోడీ అన్నారు. సంఘర్షణల ప్రభావానికి గురైన ప్రాంతాల నుండి వచ్చే ముడి చమురు, గ్యాస్‌పై భారతదేశం ఆధారపడి ఉందని నొక్కిచెబుతూ, ఈ భారం కుటుంబాలపై, రైతులపై పడకుండా చూసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది అని మోడీ అన్నారు. ముడి చమురుపై ఆధారపడటాన్ని తగ్గించడంలో ఇథనాల్ మిశ్రమం (బ్లెండింగ్) చూపే ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఒకవేళ ఇథనాల్ ఉత్పత్తి, పెట్రోల్‌లో దాని మిశ్రమం పెరగకపోయి ఉంటే, దేశం ప్రతి ఏటా విదేశాల నుండి 4.5 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకోవాల్సి వచ్చేదని మోడీ వివరించారు.

మిగతా 2లో

# వాడి తగ్గని ఇరాన్ దాడులు

## సౌదీ అరేబియా, బహ్రెయిన్లలోని అమెరికా స్థావరాలపై క్షిపణుల వర్షం

- ప్రిన్స్ సుల్తాన్ హెయిర్ బేస్ పై దాడిలో గాయపడిన అనేక మంది అమెరికన్ సైనికులు
- అనేక యుద్ధ విమానాలకు నష్టం
- ఐరాస అభ్యర్థన మేరకు హోర్ముజ్ ద్వారా మానవత సాయాన్ని అనుమతించిన ఇరాన్
- ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బతిన్న ఇరాన్ అణుశుద్ధి ఏర్పాట్లు



**వుదయం డెస్క్, మార్చి 28 :** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై నెల దాటుతున్నా, దాడుల తీవ్రత తగ్గేలా కనిపించడం లేదు. అమెరికాకు మిత్రదేశాలైన గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను కొనసాగిస్తోంది. శనివారం నాడు అందిన సమాచారం మేరకు, తాజాగా సౌదీ అరేబియా, బహ్రెయిన్‌ల లోని అమెరికా స్థావరా లపై తెహ్రాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై జరిగిన దాడిలో అనేకమంది అమెరికా సైనికులు గాయపడా, యుద్ధ విమానాలు దెబ్బతిన్నట్టు అధికారులు చెప్తున్నారు.

మిగతా 2లో

### రణరంగంలోకి హౌతీల ప్రవేశం

## ఇజ్రాయెల్ పై దాడి

**వుదయం డెస్క్, మార్చి 28 :** పశ్చిమాసియాలో సంఘర్షణ ప్రారంభమైన దాదాపు ఒక నెల తర్వాత, యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై తమ తొలి దాడిని ప్రకటించడంతో, కొనసాగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధం కొత్త దశలోకి ప్రవేశించింది. ఈ పరిణామం మధ్య ప్రాచ్యం అంతటా శత్రుత్వాలు విస్తరిస్తున్నాయని సూచిస్తోంది. వార్తల ప్రకారం, హౌతీలు ఇజ్రాయెల్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడి ప్రయత్నాన్ని ఇజ్రాయెల్ సైన్యం ధృవీకరించి, తమ వాయు రక్షణ వ్యవస్థలను క్రియాశీలం చేసినట్లు తెలిపింది. యెమెన్ నుండి ఇజ్రాయెల్ భూభాగం వైపు ఒక క్షిపణి ప్రయోగాన్ని గుర్తించామని, ఆ ముప్పును అడ్డుకోవడానికి వైమానిక రక్షణ వ్యవస్థలు పనిచేస్తున్నాయని ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు తక్షణ నివేదికలు ఏవీ లేకపోవడంతో, ప్రాథమిక సూచనల ప్రకారం ఆ క్షిపణిని అడ్డుకుని ఉండవచ్చని తెలుస్తోంది.



**యుద్ధంలోకి ప్రత్యక్ష ప్రవేశానికి హౌతీలు సంకేతాలు**

ఇరాన్‌పై దాడులు కొనసాగినా లేదా మరిన్ని దేశాలు యుద్ధంలో చేరినా తాము సంఘర్షణలోకి దిగుతామని హౌతీ గ్రూపు గతంలోనే హెచ్చరించింది. ఈ తాజా దాడి ఆ హెచ్చరికను అమలు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై తమ గ్రూపు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని ప్రతినిధి యాహ్యా సరీ ఎక్స్‌పై పోస్ట్ చేసిన ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. హౌతీలు ఉత్తర యెమెన్‌లోని చాలా ప్రాంతాలను నియంత్రిస్తున్నారు. గతంలో గాజా యుద్ధ సమయంలో డ్రోన్‌లు, క్షిపణులను ఉపయోగించి ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రత్యక్ష సైనిక చర్యకు మేము సిద్ధంగా ఉన్నామని ధృవీకరిస్తున్నాం అని పేర్కొంటూ, ఇతర దేశాలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేయవద్దని హెచ్చరిస్తూ ఆ బృందం శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది.

మిగతా 2లో

### నేపాల్ మాజీ ప్రధాని ఓలి అరెస్టు



5

## ట్రంప్, మోడీ సంభాషణలో మస్క్ లేడు

**భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీల మధ్య ఇటీవల జరిగిన ఫోన్ సంభాషణలో బిలియనీర్ ఎలాన్ మస్క్ పాల్గొనలేదని శనివారం కేంద్రం స్పష్టం చేసింది. ఈ సంభాషణలో ఆయన ప్రమేయం ఉన్నట్లు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించింది. మార్చి 24న జరిగిన సంభాషణ కేవలం ఆ ఇద్దరు నాయకుల మధ్యే జరిగిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) తెలిపింది.

మిగతా 2లో



### నెల రోజుల యుద్ధంలో ప్రముఖ నాయకులను కోల్పోయిన ఇరాన్



2




" ప్రస్తుత రోజుల్లో రాజకీయ పార్టీలు పెట్టడం సులభమే.. అయితే వాటిని నడపడం ప్రజల మద్దతుపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు ఆదరించినప్పుడు మాత్రమే ఏ రాజకీయ పార్టీ అయినా మనుగడ సాగిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చు. అది వారి రాజ్యాంగబద్ధమైన హక్కు. కవిత కొత్త పార్టీ పెట్టడాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. కేవలం పార్టీ ప్రకటించినంత మాత్రాన సరిపోదు. క్షేత్రస్థాయిలో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కొత్త పార్టీ వస్తే కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదు. మా ఓటు బ్యాంక్ చెక్కుచెదనిది. ప్రజలు మా ప్రభుత్వంపై మేము తీసుకునే విధానాలపై పూర్తి నమ్మకంతో ఉన్నారు.

* మహేశ్ కుమార్ గౌడ్, టిపిసిసి అధ్యక్షుడు "

## వే'మన'పద్యం

మిరపగింజచూడ మీద నల్లగనుండు
గొరికిచూడలోన జురుకు మనును
సజ్జనులగువారి సారమిట్లుండురా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# నేపాల్ లో నవశకం

నేపాల్ ఎన్నికల ఫలితాలు ఊహించినట్టే వచ్చాయి.ప్రధాని బాలేంద్ర షా నాయకత్వంలోని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా తనంత తానుగా అనూహ్య మైన విజయాభి షేకం చేయించుకున్నది. నేపాల్ లో గల రెండు విధానాల ఓటింగ్ పద్ధతిలో ఇటువంటి విజయం అసాధారణమైనది.మొత్తం 275 పార్లమెంట్ స్థానాల్లో 165 స్థానాలకు మాత్రమే సాధారణ మెజారిటీ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీలకు పడిన ఓట్ల దామాషా మేరకు మిగతా 110 స్థానాల్లో విజేతలను నిర్ణయిస్తారు.ఇటువంటి క్లిష్ట మైన ఎన్నికల్లో అధికార ఆర్ ఎస్ పి మొత్తం 275 స్థానాల్లో 182 సీట్లు గెలుచు కోవడం పాత పాలకులపై నేపాలీలు ఎంతగా విసిగి పోయారో తెలియజేస్తున్నది .గత పాలకులు ప్రజల మంచి చెడ్డలను బొత్తిగా పట్టించుకోకుండా సొంత బాగు చూసుకోడం లోనే నిత్యం మునిగి తేలడంతో అక్కడ ఆబాలగోపాలం పాత పాలక పార్టీలన్నింటిని కట్టగట్టి తిరస్కరించారు. సహనం కోల్పోయి సాయుధ మార్గం పట్టడం లేదా పూర్వపు రాచరిక పాలనవైపు మొగ్గకుండా ప్రజాస్వామికంగా స్పందించడం బాగుంది పాత పాలక శక్తులను సమూలంగా పెరికివేసి కొత్త యువ శక్తులను ఎన్నుకోవడం ఎంతో హృద్యంగానూ ఉంది.ఇది పూర్తి జెన్-జెడ్ విప్లవం. నూతన ప్రధాని బాలేంద్ర షా వయసు 35.ఆయన మంత్రివర్గంలో అత్యధికులు 40 సంవత్సరాల లోపు వయసువారే. నిరుద్యోగం నిప్పుల కొలిమిలో నానా బాధలు పడుతున్న ప్రజలకు 12 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని ప్రధాని బాలేంద్ర షా వాగ్దానం చేశారు.చైనా -ఇండియాలకు సమాన దూరంలో ఉండి అలీన విదేశాంగ విధానాన్ని పాటిస్తామని చెప్పుకున్నారు. అవినీతిని రూపుమాపుతామన్నారు. అన్ని వైపులా భూమి మాత్రమే గల నేపాల్ నూతన నాయకత్వం లో భారత చైనా ల ఒత్తిడిని ఎలా తట్టుకోగలుగుతుందో చూడాలి.వెనక్కు తిరిగి చూస్తే ఢిల్లీ లో మొదటిసారి ఆప్ అధికారంలోకి రావడం వంటి సందర్భాలు గుర్తుకు వస్తాయి. అయితే అవినీతికి వ్యతిరేకంగా పాత తుప్పుపట్టిన వ్యవస్థ లు కూలిపోయినట్టు అనిపించినా తిరిగి అవే రకం శక్తులది పైచేయి కావడమూ చూస్తున్నాము. నేపాల్ లో మాత్రం ఈ మంచి ఇంకా పెరిగి అక్కడి ప్రజలకు అపారమైన మేలు జరగాలని ఆశిద్దాము.మొదట రాచరికం కాడిని మోసిన నేపాల్ ప్రజలు తరువాత చండ ప్రచండ మావోయిస్టుల ధోరణులనూ చూశారు చివరికి యువశక్తుల శుద్ధ పాలన ముంగిట ఉన్నారు.అనవసరమైన నిత్య వివాదభరితమైన పొత్తుల అవసరం లేకుండా అఖండ మెజారిటీ తో అధికారంలోకి వచ్చిన కొత్త శక్తులు నేపాల్ ప్రజల ఆశలను వమ్ము చేయరని సఫల ప్రజా స్వామ్యంతో ఈ చిన్న దేశం ప్రపంచానికి పాఠం చెబుతుందని ఎదురు చూద్దాం.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# చమురుపై ఎక్సైజ్ తగ్గింపు మతలబేమిటి !

కుక్క పిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా కాదేదీ కవితకనర్హం అన్నాడు మహాకవి శ్రీశ్రీ. భారత చక్రవర్తి నరేంద్రమోడీకి భజన చేసేందుకు ఏ అవకావశాన్నీ వదలం అంటున్నారు ఆంధ్రప్రదేశ్ రాజు చంద్రబాబు నాయుడు, యువరాజు లోకేష్ నాయుడు, సామంత రాజు పవన్ కల్యాణ్. పెట్రోలు,డీజిలు మీద కేంద్ర ప్రభుత్వం లీటరుకు పది రూపాయల చొప్పున ఎక్సయిజ్ డ్యూటీ తగ్గించిందన్న వార్త రాగానే ముగ్గురూ మోడీని అభినందించారు. ఎందుకటా ! వినియోగదారులకు ధర తగ్గించినందుకు కాదు, పెంచనందుకు అన్నది వారి స్పందనల సారం. పూర్వం రాజుల కాలంలో రాజుగారు ఏది చేసినా గొప్పదే అని పొగిడే భట్రాజుల(కులం గురించి కాదు)ను వారు గుర్తుకు తెచ్చారంటే అతిశయోక్తి కాదు. భట్రాజులకు రాజులు, రంగప్పలు నజరానా ఇచ్చేవారు, కేంద్రం ఇస్తున్నది వడ్డీలకే చాలటం లేదని చంద్రబాబు నాయుడు మంత్రులతో అన్నట్లు లీకు వార్తలు. ఈ పూర్వరంగంలో మోడీని పొగిడినందుకు ఆంధ్రప్రదేశ్‌కు ఏమైనా ఒరగబెడతారా ? వ్రతం చెడ్డా ఫలం దక్కదా ! చూద్దాం. కొసమెరుపు ఏమంటే నరేంద్రమోడీని పొగడటంలో పోటీపడే వైసిపి నేత జగన్‌మోహన రెడ్డి ఈ విషయంలో వెనుకబడినట్లు కనిపిస్తున్నది, స్పందన కనిపించలేదు, వినిపించలేదు. ఇక్కడ ఒక్క సందేహం. చంద్రబాబు సిఎం, పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి, మరి మోడీని పొగడటంలో మంత్రిలోకేష్ పాత్ర ఏమిటి ? పలుకుబడి, ప్రతిష్ట పెంచేక సరత్తులో భాగమా ? మిగిలిన మంత్రులు ఎందుకు స్పందించలేదు.ఎవరికి తోచింది వారు అనుకొనే స్వేచ్ఛ ఉంది గనుక వదిలేద్దాం !చిత్రం ఏమిటంటే వినియోగదారుల మీద విపరీత భారం మోపినపుడు చంద్రబాబు అండ్ కో మౌనంగా ఉండి ఇప్పుడు ఏదో ఒరగబెట్టినట్లు భజన చేశారు. ?ఏమి రాజకీయంరా నాయనా ! అసలు నరేంద్రమోడీ ఎందుకీ నిర్ణయం తీసుకున్నారు ? శుక్రవారం నాడు ఎక్సయిజ్ పన్ను తగ్గింపు వార్త వినగానే శ్రీరామనవమి వేడుకల్లో ఉన్న జనం ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే చమురు ధరలు పెరుగుతాయని మానసికంగా సిద్ధం అయిపోయిన వారు నిజమేనా మోడీ సర్కార్ ఇంత మేలు చేసిందా అని కాళ్లు చేతులు గిల్లుకున్నారు, తలలు కొట్టుకున్నారు.చర్మాలు స్పందించటంతో రామా ఇలా కరుణించావా అని సంబరపడ్డారు. అయితే బంకుల వద్దకు వెళ్లగానే ఆ " తగ్గింపు " అంబానీ, నయారా వంటి ప్రైవేటు కంపెనీలతో బాటు కేంద్ర ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు తప్ప వినియోగదారులకు కాదని తెలియగానే చల్లబడిపోయారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దుర్మార్గదాడుల కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగాయి. ఆ పేరుతో నయారా అనే ప్రైవేటు కంపెనీ పెట్రోలు మీద లీటరుకు ఐదు, డీజిలు మీద మూడు రూపాయల చొప్పన ధర పెంచింది. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం పవర్ పెట్రోలు ధర లీటరుకు రు.2.36వరకు పరిశ్రమల్లో ఉపయోగించే డీజిల్ ధరను 22 రూపాయలు పెంచింది. దిగుమతి ఖర్చు పెరిగినందున మన దేశంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు లీటరు పెట్రోలు మీద రు.18-20. డీజిలు మీద రు.30-35 నష్టం వస్తున్నదని చెబుతున్నారు. (అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పతనమైనపుడు వాటికి ఎంత లాభవచ్చిందో చెప్పరు) అందువలన వాటికి ఉపశమనం కలిగించేందుకు మోడీ పూనుకున్నారు. ప్రత్యేక ఎక్సయిజ్ డ్యూటీని పెట్రోలు మీద రు.13ను మూడుకు తగ్గించగా, డీజిల్ మీద పదిరూపాయలను పూర్తిగా ఎత్తివేశారు.ఈ శ్రద్ధ కోట్లాది మంది వినియోగదారుల మీద లేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభం కాగానే వంటగ్యాస్ మీద గృహ వినియోగదారులకు అరవై రూపాయలు పెంచారు, ముష్టిగా విదుల్చుతున్న 40రూపాయల సబ్సిడీని గుట్టు చప్పుడు కాకుండా ఎత్తివేశారు, అంటే వంద రూపాయల మేరకు




వడ్డించారు. అచ్చేదిన్ పేరుతో 2014లో అధికారానికి వచ్చిన మోడీ జనాలకు ఏదో ఒరగబెడతారని అందరూ ఆశించారు.అదనంగా అన్నవస్త్రాలు ఇస్తారనుకొంటే ఉన్న వస్త్రాలను లాగేసుకున్నట్లు కొత్తగా మేలు చేస్తారనుకుంటే డీజిలు, పెట్రోలు మీద సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేశారు,గ్యాస్ మీద ముష్టి మాదిరి విదిల్చారు.ఇప్పుడు దాన్ని కూడా రద్దు చేశారు. మేలు సంగతి తరువాత భారం ఎలా మోపారో చూద్దాం. మోడీ అధికారానికి వచ్చిన 2014-15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం ప్లానింగ్ ఎనాలసిస్ సెల్ సమాచారం ప్రకారం చమురు రంగం నుంచి ఎక్సైజ్ డ్యూటీ రాబడి రు.99,068 కోట్లు, దాన్ని 2020-21 నాటికి రు.3,72,930 కోట్లకు పెంచారు. తరువాత ఎన్నికలు, తదితర కారణాలతో 2023-24 నాటికి రు.2,73,684 కోట్లకు తగ్గించారు.2025-26 తొలి ఆరు నెలల్లో రు.1.30వేల కోట్ల మేర రాబడి వచ్చింది.పెట్రోలు మీద కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న అసలు సిసలు ఎక్సయిజ్ పన్ను లీటరుకు రు.1.40,(దీన్లో మాత్రమే రాష్ట్రాలకు వాటా ఉంది) ఇదిగాక ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ రు.13, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పేరుతో రు.2.50, రోడ్ల పేరుతో రు.5 వంతున మొత్తం రు.20.50 వసూలు చేస్తున్నారు. (అంతకు ముందు రు.30కి పెంచి తరువాత తగ్గించారు). ఇప్పుడు రు.13లో పది రూపాయలు తగ్గించినప్పటికీ అది వినియోగదారులకు చేరటం లేదు. సాధారణ డీజిల్‌పై పదహారు రూపాయల బాదుడులో పది రూపాయలు రద్దు చేశారు. అయినా వినియోగదారులకు ఒక్క పైసా కూడా తగ్గలేదు. అంటే చమురు మార్కెట్ కంపెనీలు పది రూపాయల మేరకు ధరలను పెంచినట్లే.ఈ మాత్రానికే మోడీకి భజన చేయాలా ? తాజా నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తగ్గిన ఆదాయలోటును ఎలా సర్దుబాటు చేయనుంది ?బడ్జెట్‌లో సంక్షేమ పథకాల కేటాయింపులకు కోత పెట్టటం లేదా ఏదో ఒకసాకుతో జిఎస్‌టి, సెస్‌ల పెంపుదలకు పూనుకోవాల్సి ఉంటుంది. పశ్చిమాసియా సంక్షోభం ముగిసిన తరువాత తిరిగి అదనపు ఎక్సయిజ్ పన్నుబాదుడు ద్వారాపూడ్చుకోవచ్చు.చావు కబురు చల్లగా చెప్పినట్లు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సమీక్షించి ధరల నిర్ణయం చేస్తామని శుక్రవారం నాడు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. పరోక్ష పన్నులు మరియు కస్టమ్స్ కేంద్ర బోర్డు అధ్యక్షుడు వివేక్ చతుర్వేది విలేకర్లతో మాట్లాడుతూ " మీరు ఊహించుకొనే విధంగా పరిస్థితి లేదని, మనం కష్టకాలంలో ఉన్నామని " చెప్పారు. నరేంద్రమోడీ గారేమో అంతా సజావుగా ఉందని చాలా రోజుల పాటు చెప్పించి, కరోనా మాదిరి పరిస్థితిని ఎదుర్కొంటున్నాం అని పార్లమెంటులో మాట్లాడి జనాన్ని భయపెట్టిన సంగతి తెలిసిందే.అధికారులెందుకు ఈ విధంగా మాట్లాడుతున్నట్లు ? ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ పది రూపాయలు తగ్గించిన కారణంగా ప్రతి పదిహేను రోజులకు ఏడువేల కోట్ల రూపాయల మేర కేంద్ర ప్రభుత్వం రాబడిని కోల్పుతున్నదని వివేక్ చెప్పారు, అంటే ఏడాదికి రు.1.68లక్షల కోట్లు. మోడీ సర్కార్ వంచన గురించి చెప్పుకోకపోతే జనాలకు అన్యాయం చేసినవాళ్లం అవుతాము.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గితే వినియోగదారులకు తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అని చెప్పిన వారు 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి ధరలను సవరించటం నిలిపివేశారు. ఆ ఏడాది ఏప్రిల్, మే,జూన్,జూలై నాలుగు నెలల్లో మనం దిగుమతి చేసుకున్న ముడి చమురు ధర సగటున 108.5 డాలర్లు. ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వచ్చింది.2022-23 ఏడాది సగటు ధర 93 డాలర్లు. ఇక 2025 ఏప్రిల్ నుంచి 2026ఫిబ్రవరి వరకు పదకొండు నెలల సగటు ధర 66.53 డాలర్లు, అంటే నాలుగేండ్లలో ఇంతగా తగ్గినప్పటికీ వినియోగదారులకు పైసా తగ్గించలేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తరువాత మార్చినెల 25వ తేదీ వరకు ఉన్న కొనుగోలు సగటు ధర 123 డాలర్లకు చేరింది. ఈ వివరాలు ఏ కమ్యూనిస్టులో, కాంగ్రెస్ వారో చెప్పినవి కాదు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పెట్రోలియం ప్లానింగ్, అనాలిసిస్(పిపిఏసి) వెబ్‌సైట్ వెల్లడించిన సమాచారం.

ఆయిల్ ప్రైస్ డాట్‌కామ్ సమాచారం ప్రకారం ఫిబ్రవరి 25న మనదేశం కొనుగోలు చేసిన ముడి చమురు ధర 70.25 డాలర్లు ఉంటే మార్చినెల 23న 157డాలర్లకు చేరింది. ఈ కారణంగానే ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ధరలను సమీక్షిస్తామని కేంద్రం చెప్పింది. నాలుగేండ్ల పాటు జనాల నుంచి లక్షల కోట్లు అదనంగా వసూలు చేసి ఖజానా నింపుకొని అదానీ, అంబానీ వంటి వారికి సబ్సిడీలు రూపంలో కట్టబెట్టారు, పారుబాకీల పేరుతో లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశారు.ఇప్పుడు ధరలు పెరిగి ఒక నెల రోజులు కూడా గడవక ముందే చమురు కంపెనీల కోసం నడుంకట్టారు. మోడీ మీద తెలుగుదేశం, జనసేన, వైసిపి వంటి పార్టీలకు ఉన్న మోజు తెలిసిందే. అది ఎంత ఉన్నా జనాన్ని ఇలా చావబాదుతుంటే పల్లెత్తు విమర్శ చేయలేదు.అఫ్ కోర్స్ జనానికి కూడా ఆ మత్తు వదలలేదు అన్నది నిజం. ఇతర సందర్భాలలో మాట్లాడినపుడు బిజెపి, తెలుగుదేశం పార్టీ పెద్దలు ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదు అంటారు. కానీ ఆచరణలో కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేసినట్లు కనిపించటం లేదా ? దిగుమతి చేసుకున్న చమురు భారంగా మారుతున్నదంటూ గుండెలు బాదుకుంటారు. దీనికి రూపాయి విలువపతనాన్ని అరికట్టటంలో వైఫల్యం లేదా ? మోడీ అధికారానికి వచ్చినపుడు, ఇప్పుడు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు పీపా ధర ఒక డాలర్‌గానే ఉంది అనుకుందాం. నాడు అరవై రూపాయలు చెల్లిస్తే సరిపోయేది, ఇప్పుడు అదే డాలరుకు 94చెల్లించాల్సి వస్తోంది.ఈ నిర్వాకానికి బాధ్యత ఎవరిది ? యుపిఏ పాలనలో రూపాయి పతనం చెందినపుడు అసమర్ధ మన్మోహన్ సింగ్ కారణం అన్నారు కదా ! ఇప్పుడు " సమర్ధ " నరేంద్రమోడీ అని చెప్పక తప్పదు. దేశంలో ముడిచమురు ఉత్పత్తి పెంచలేదదని గతంలో తీవ్రవిమర్శలు చేశారు.పన్నెండ్ల నరేంద్రమోడీ ఏలుబడి నిర్వాకం ఎలా ఉందో తెలుసా ? 2014-15లో ప్రభుత్వ-ప్రైవేటు ఉత్పత్తి 35.9 మిలియన్ టన్నులుంటే 2023-24నాటికి 27.2మి.టన్నులకు పడిపోయింది. ఇప్పుడు ఇంకా దిగజారింది. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలన్ని కలసి 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన మొత్తం 25.6మిలియన్ టన్నులే. ఇలాంటివారు ఆత్మనిర్భరత, వికసిత్ భారత్ పేరుతో 2047నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామని కబుర్లు చెబుతుంటే జనం చెవుల్లో పూలు పెట్టుకొని తలలు ఊపాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గితే తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అంటూ అంతకు ముందు ప్రతిరోజూ సవరించిన ధరల విధానాన్ని నాలుగేండ్లు ఎందుకు పక్కన పెట్టారో ఇప్పుడు తిరిగి దాని గురించి ఎందుకు మాట్లాడుతున్నారో జవాబుదారీ తనం గురించి తమ భుజాలను తామే చరచుకొనే పెద్దలు ఎవరైనా చెబుతారా ? రాజకీయనేతలను కాసేపు పక్కన పెడదాం. వారు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని తెలిసిన జనంలో అసలు ప్రశ్నించే గుణం ఎందుకు అంతరించినట్లు ? నిజంగానే ఈ ధోరణి గురించి పరిశోధనలు జరపాల్సిన అవసరం ఉంది. ఆక్రమిత కాశ్మీరులో పాక్ ప్రభుత్వం భారాలు పెంచితే వాటిని భరించలేక అక్కడి జనం మనదేశంలో విలీనం కావాలని కోరుకుంటున్నట్లు వీడియోను చూపి కొందరు వీరంగం వేస్తుంటారు. ఇక్కడి జనం మీద మోడీ మోపుతున్న భారాలు వారికి పట్టవు. పాకిస్తాన్ సుత్తి ఇనుపదైనా భారత్‌ది బంగారపుదైనా తల పగులుతుంది. మంచి రోజులను(అచ్చేదిన్) తెస్తామంటే జనం నమ్మారు. ప్రజలకు అన్యాయం జరిగితే నిలదీస్తాం, తాటవలుస్తాం అందుకే పార్టీని పెట్టాం అని జనసేన నేత పవన్ కల్యాణ్ గతంలో ప్రకటించినపుడు జనం నిజమే కదా నిజమే కదా అనుకున్నారు. 2019కి ముందు నరేంద్రమోడీని, చంద్రబాబు నాయుడిని అదే మాదిరి నిలదీసినమాట నిజం. తరువాత చంద్రబాబును వదలి వేశారు.నరేంద్రమోడీతో చేతులు కలిపారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మాత్రమే 2024 ఎన్నికల వరకు అది జనం సమస్యలైనా, జగన్ వ్యవహారశైలినైనా నిలదీశారు, తాటవలిచారు. ఇప్పుడు తత్వం తలకెక్కింది గనుక మౌన దీక్ష పట్టారు. అక్రమం జరుగుతుంటే మౌనంగా ఉండమని సనాతనం కూడా ఎక్కడా చెప్పలేదు.ఎదుటి వారి జేబులో పర్సు కొట్టేసినట్లు తెలియగానే ఎవరైనా వెంటనే దాన్లో ఎంత డబ్బు ఉంది అని అడుగుతాం, తక్కువ మొత్తమే అని తెలిస్తే పోనీలే అని ఊపిరి పీల్చుకుంటాం.అదే కేంద్ర ప్రభుత్వమైనా మరొకరైనా చమురు పన్ను పేరుతో మన పర్సుకొట్టేస్తున్నపుడు ఎంత పోగొట్టుకున్నాం అని ఆలోచించాలా వద్దా ? అఫ్ కోర్స్ అది కష్టపడిన సొమ్ము కాకపోతే వదిలేద్దాం !



ఎం కోటేశ్వరరావు
8331013288

# నింబ కుసుమ సేవనం

వేప పువ్వు గుణ వంతమైన ఓషధి. రక్తాన్ని శుద్ధి చేసి, వృద్ధి పరిచే గుణం కలిగి ఉంటుంది. వైద్యానికి చాలావరకు ఉపయోగించే వేప చెట్టుకు ప్రాధాన్యత ఉంది. వృక్ష సర్వాంగాలు వైద్యానికి ఉప యుక్తాలే. ప్రధానంగా రోగ క్రిమి నాశని (యాంటీ బయాటిక్) గా వాడటం కద్దు. మానవునికి ఆరోగ్య ప్రదాయిని అయిన వృక్ష రాజా లలో వేప ముఖ్యమైనది. స్వర్గలోకంలో ని "Ambrosia" వృక్షం యొక్క అంశతో, భూలోకాన "వేపచెట్టు" పుట్టిందని,



మహారాష్ట్ర సంప్రదాయక విజ్ఞానం స్పష్ట పరుస్తున్నది. ప్రాణవాయువు మూలాధారమైన వేప వృక్ష గాలి ఆరోగ్య ప్రధానమైనదని, విజ్ఞాన శాస్త్రం స్పష్టం చేస్తున్నది. వేపపువ్వు, వేప ఆకు రెండూ ఉపయోగకరమైనవి. ఆయుర్వేద వైద్యులు వేపాకు విరివిగా వాడతారు. చర్మవ్యాధులకు పచ్చి వేపాకు నలుగు పెడతారు. అమ్మవారి జబ్బులలో రోగులకు, ఆకులు దట్టంగా ఉండే వేప రొట్ట వాడుతారు. వ్యాధులు సోకకుండా, ఇళ్ళ ముంగిళ్ళలో వేపాకు తోరణాలు కడుతుండడం, సర్వత్రా దర్శనమిచ్చే దృశ్యం. వసంత రుతువు సంబంధిత పర్వదినమైన ఉగాదినాడు దొరికే వేప పువ్వు వాడమనే పెద్దల ఉద్దేశం, ప్రాప్త కాలజ్ఞతకు నిదర్శనం. ఆ ఆచారమే సంప్రదాయ సిద్ధం, స్తవనీయం, సర్వోత్తమం. ప్రకృతి ఆరాధనకు పెరు మోసిన మన పెద్దలు, రాగల కష్టాలను, సుఖాలను అనుభవించడానికి, సంసిద్ధంగా ఉంటామని సూచించడానికి, "ఉగాది" నాడు, "నింబ కుసుమ భక్షణం", "పచ్చడి సేవనం" విధిని కల్పించారు. వేప చెట్టుకు వృక్ష శాస్త్ర నామం Helia azadirachta అని. ఇందులో Helia అన్నది గ్రీకు పదం. azadirachta అన్నది పారశీక తద్భవం. పారశీక భాషలో వేప చెట్టుకు,Helia azadirachta అని పేరు. దీనికి ఉత్తమ వృక్షం అని అర్థం పంచాంగంలో "నింబ కుసుమ భక్షణం" అని ఉన్నా, "ధర్మసింధువు" ఈ పర్వపు ఆచరణ విధానంలో "నింబ పత్రాషనం" అని ఉంటుంది. దీనినిబట్టి ఉగాదినాడు వేపాకు తినాలని స్పష్టమవుతున్నది. పొరుగు వారైన కర్ణాటక వారు అరవ వారు, ఉగాది రోజులు వేరైనా, ఆనాడు ప్రత్యేకంగా వేప వాడతారు. తెలుగువారితో సంపర్కం ఉన్న తావులలో వారిలాగే వేప పువ్వులు ఉగాది పచ్చడికి వినియోగిస్తారు.ఇక మాళవ, మహారాష్ట్ర, వంగ దేశస్తులు ఉగాది నాడు వేపపువ్వు కాకుండా వేపాకులను వాడతారు. మాళవ దేశస్థులు ఉగాది నాడు, వేపాకులను ముద్దగా నూరి సేవిస్తారు. వంగ దేశస్థుల ఉగాది తెలుగు వారి కంటే నెల రోజుల అనంతరం రావడం చేత, వేపపువ్వు అప్పటికి అరుదుగా లభించే కారణంగా వేపాకు వాడతారు. తెలుగునాట ఉగాది నాటికి వేపచెట్లు, ముమ్మరంగా పోతపోసి ఉంటాయి. అందుకే మన పూర్వీకులు వేప వృక్ష సంబంధిత కొత్త చిగుళ్ళను ఉగాది పర్వదినాన తినడాన్ని నిర్ణయించారు. వేప పువ్వు పచ్చడి ఉగాది నాడు మాత్రమే తినడమే కాదు, దాని లభ్యతను బట్టి విశేషంగా సేకరించి, ఎండబెట్టి ఉంచుకొని, ఏడాది పొడుగునా వేయించుకుని కూరలో, పచ్చడి గానో చేసుకుని, దానితో చారు కాచుకొని సేవిస్తూ, రక్తశుద్ధి, రక్త వృద్ధిని కలిగించుకోవడం, ఆరోగ్య కాముకుల ఆచరణ. "ఉగాది పండుగ నాడు ఏమి చేస్తే, ఏడాది పొడవునా అదే చేస్తుంటారు" అనే నానుడి, వేపపువ్వు వాడకం విషయంలో వాస్తవమే అనిపిస్తుంది.




సంగనబట్ల
9440595494

# ఇప్ప గొప్పను ఏమని చెప్పాలి?

అడవుల్లో నిశ్శబ్దంగా రాలిపడే ఇప్పపూలు గిరిజనుల జీవితాల్లో ఒక ఆర్థిక విప్లవానికి నాంది కావచ్చు. వేల ఏళ్లుగా ఈ చెట్టు వారి జీవన విధానంలో భాగమై ఉంది. పూలు ఆహారం, గింజలు నూనె, చెట్టు నీడ జీవనాధారం. కానీ ఈ ప్రకృతి ఇచ్చిన ఈ వరం ఇప్పటికీ సరైన గుర్తింపు, మార్కెట్, పాలసీ లేక నిస్సహాయంగా ఉంది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీలో ఒక సభ్యుడు ఇప్పసారా, ఇప్పపూలలో పోషకాల గురించి సంచలన వ్యాఖ్యలు చేశాక ఇంత వరకు ప్రభుత్వాలు ఇప్ప చెట్టు విలువను నిజంగా అర్థం చేసుకోలేక పోయాయి అనే దిశగా ఈ చెట్టుమీద సర్వత్రా చర్చ మొదలైంది. మధ్య భారతదేశంలో ముఖ్యంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఇప్ప చెట్టు గిరిజనుల ఆరోగ్యానికి అండగా 'ఆర్థిక అస్త్రం'గా ఉంది. అయితే దాన్ని ఆధునిక మార్కెట్‌తో సమన్వయం చేయడంలో మనం వెనుకబడ్డాం. ఇప్ప పూలతో తయారయ్యే సారా ఒక సంప్రదాయ పానీయం మాత్రమే కాదు , అది ఒక ఉపాధి అవకాశమూ. కానీ ఇప్పటికీ ఇది ' చట్టబద్ధం కాదు' అనే ముద్రతోనే కొనసాగుతోంది. సరైన ప్రభుత్వ విధానాలు లేకపోవడం వల్ల ఈ విలువైన అటవీ సంపదను ఉపయోగించుకోలేక పోతున్నాం. వీటి అమ్మకాల్లో గిరిజనులు మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నారు.

**మధ్యప్రదేశ్ చెప్పే పాఠం..** ఈ విలువైన చెట్ల మీద మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రయోగం చేసింది. ఇప్ప సారాను "హెరిటేజ్ లిక్కర"గా గుర్తించి, గిరిజనులతో కలిసి ఉత్పత్తి చేసి "Mond" అనే బ్రాండ్‌తో మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇది ఒక నిర్మాణాత్మక దిశగా పెద్ద అడుగు. కానీ మార్కెటింగ్ లోపం, వినియోగదారుల అవగాహన లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఇది మనకు ఒక స్పష్టమైన పాఠం చెబుతోంది ఉత్పత్తి మాత్రమే సరిపోదు, మార్కెట్‌ను కూడా నిర్మించాలి.

**తెలంగాణలో సాధ్యమా?..** తెలంగాణ లోని ఆదిలాబాద్, భద్రచలం అడవుల్లో కూడా ఇప్ప చెట్లు సమృద్ధిగా ఉన్నాయి. అయితే ఇక్కడ ఇప్ప సారా ఉత్పత్తి ఒక వ్యవస్థగా అభివృద్ధి చెందలేదు. ఆదివాసీలు పండుగలు, శుభకార్యాలపుడు సొంతంగా తయారు చేసుకుంటారు



*మనం ఇప్ప చెట్టును కేవలం "సారా చెట్టు"గా చూసుకుంటామా? లేక "గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు ప్రతీక"గా గుర్తిస్తామా? సరైన పాలసీలు, మార్కెటింగ్, బ్రాండింగ్ ఉంటే ఇప్ప చెట్టు గిరిజన ప్రాంతాల్లో బంగారు భవిష్యత్తును నిర్మించగలదు. లేకపోతే అది అడవుల్లోనే నిశ్శబ్దంగా ఎండిపోయే మరో కోల్పోయిన అవకాశంగా మిగిలిపోతుంది.*

. దానికి కూడా కొంత వరకే ప్రభుత్వ పరిమితి ఉంది. అయితే దీనిని ఒక ఉపాధి మార్గంగా చూసినపుడు ఇది ఒక కోల్పోతున్న అద్భుత అవకాశం. గిరిజన మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, కోఆపరేటివ్ మోడల్ ద్వారా ఇప్ప ఉత్పత్తులను ప్రాసెస్ చేసి మార్కెట్లోకి తీసుకొస్తే, ఇది వేల కుటుంబాలకు ఉపాధి కల్పించగలదు. ముఖ్యంగా "సహజ ఉత్పత్తులు"పై పెరుగుతున్న డిమాండ్‌ను ఉపయోగించుకోవచ్చు.

**ఇప్ప పూలను తాకితే పులి వస్తుందా?**

' అడవుల్లో విస్తారంగా పెరిగే ఇప్ప చెట్ల మీద పూలను మేం తాకము. అవి కింద రాలిపోయిన తరువాతనే ఏరుకుంటాం. చెట్లమీద పూలను తాకితే పులి వస్తుందని మా గోండు గిరిజనులు గట్టిగా నమ్ముతారు. అందుకే కట్టెతో కూడా వాటిని టచ్ చేయరు.' అంటాడు ఆదిలాబాద్‌జిల్లా, ఉట్నూరులో 'ఆదివాసీ ఆహార కేంద్రం' నిర్వహిస్తున్న కుమ్రా విటల్ రావు.

**తొలి ఇప్పపూవు లడ్డూ కేంద్రం**

ఈ ప్రాంతంలో ఏటా క్వింటాళ్ల కొద్దీ ఇప్పపూలు అడవుల్లో రాలిపోతుంటాయి. కొందరు సేకరించినా ఎక్కువ శాతం వృధా అవుతుంటాయి. విలువైన ఈ అటవీ ఉత్పత్తి నుండి అడవిబిడ్డల ఆదాయం పెంచాలనే ఆలోచనతో 2020లో అప్పటి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్యా దేవరాజన్ ఉట్నూరులో కొంత స్థలం కేటాయించి 12 మంది మహిళలతో భీంబాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం ఏర్పాటు చేశారు . ' మాకు ఆర్థిక సహాయం అందించడమే కాక, ఇప్పపూలతో విలువ ఆధారిత ఉత్ప త్తుల తయారీలో జార్ఖండ్‌లో శిక్షణకు పంపించి, ఆహార పదార్థాలు తయారీకి అవసరం అయిన యంత్రాలను కూడా సమకూర్చడంతో ఇపుడు తెలంగాణలో తొలి ఇప్పపూవు లడ్డూ కేంద్రంగా పేరు వచ్చింది. అన్నారు, అధ్యక్షురాలు కుమ్ర భాగు బాయి. ఈ కేంద్రంలో ఇప్పపూల లడ్డూలు, జ్యూస్ తయారు చేస్తున్నారు. ఆదిలాబాద్ ,కుమురం భీం అసిఫాబాద్ జిల్లాల్లో 2,600 మంది గిరిజన గర్భిణులకు, ఆశ్రమ స్కూళ్లలో చదువుతున్న గిరిజన విద్యార్థినులకు ఈ లడ్డూలను సరఫరా చేస్తున్నారు.

**ఇప్ప సారాలో ఏముంది?**

ఇప్ప సారా ఆరోగ్య పరంగా కెమికల్ లిక్కర్ కంటే మెరుగైనదని కొందరు భావిస్తున్నారు. ఇది సహజ ఫర్మెంటేషన్ ద్వారా తయారవుతుందని నిపుణులంటారు కానీ ఇది కూడా ఆల్కహాల్ అన్న విషయం మర్చిపోవద్దు. కాబట్టి దీన్ని "హెల్త్ డ్రింక"గా కాకుండా, నియంత్రిత వినియోగంతో కూడిన సంప్రదాయ ఉత్పత్తిగా చూడాలి. ఆరోగ్యంపై దాని ప్రభావం కంటే, గిరిజనుల ఆర్థిక స్థితిపై దాని ప్రభావం చాలా ముఖ్యమైనది. నిజానికి ఇప్ప చెట్టు చుట్టూ ఒక సంపూర్ణ ఆర్థిక వ్యవస్థను నిర్మించవచ్చు. పూలతో సారా మాత్రమే కాదు, జ్యూస్, సిరప్, జామ్, గింజల నూనె, బయోఫ్యూయల్ వంటి అనేక ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ఎకోటూరిజంతో కలిపితే "ట్రైబల్ ఎక్స్‌పీరియెన్స"గా ప్రపంచానికి పరిచయం చేయవచ్చు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే మార్గం. అంతిమంగా ఒక ప్రశ్న మనం ఇప్ప చెట్టును కేవలం "సారా చెట్టు"గా చూసుకుంటామా? లేక "గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు ప్రతీక"గా గుర్తిస్తామా? సరైన పాలసీలు, మార్కెటింగ్, బ్రాండింగ్ ఉంటే ఇప్ప చెట్టు గిరిజన ప్రాంతాల్లో బంగారు భవిష్యత్తును నిర్మించగలదు. లేకపోతే అది అడవుల్లోనే నిశ్శబ్దంగా ఎండిపోయే మరో కోల్పోయిన అవకాశంగా మిగిలిపోతుంది.



శ్యాంమోహన్
9440595858



# జాతీయం-అంతర్జాతీయం



## సీట్ల పంపిణీని ఖరారు చేసిన డిఎంకె



**చెన్నై, మార్చి 28 (వుదయం డెస్క్) :**
మిత్రపక్షాలతో సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం, అధికార డిఎంకె శనివారం నాడు తన వారికి నియోజకవర్గాల కేటాయింపును ఖరారు చేసింది. ఆ వెంటనే, పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రత్యక్షంగా పోటీ చేస్తున్న మొత్తం 164 నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మొత్తం 234 స్థానాల్లో మిత్ర పక్షాలకు 70 సీట్లు ఇచ్చింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్‌కు 28 సీట్లు కేటాయించింది. వాటిలో పొన్నేరి, ఈరోడ్ ఈస్ట్, విలవన్‌కోడ్, శివకాశి, కారైకుడి మొదలైన స్థానాలు ఉన్నాయి. డీఎండీకేకు 10 సీట్లు, రెండు వామపక్ష పార్టీలకు చెరో 5 స్థానాలు, వీసీకేకు 8, ఎండీఎంకే 4, ఎంఎంకే 2, ఐయూఎంఎల్ 2, ఎంజేకే ఎస్‌డీపీఐకు చెరొక సీటు కేటాయించింది.

మిత్రపక్షాలకు కేటాయించిన నియోజకవర్గాల జాబితాలో, ఆ పార్టీలు కోరుకున్న వాటితో పాటు కొన్ని కొత్త నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. కాగా, డీఎంకే అభ్యర్థులలో కూడా సుపరిచిత ముఖాలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, 60 మందికి పైగా తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న వారు ఉన్నారు.
పార్టీలోని చాలా మంది సీనియర్, ప్రముఖ నాయకులు అవే నియోజక వర్గాల నుంచి పోటీ చేయనున్నారు. వీరిలో కోలత్తూరు నుంచి నాలుగోసారి ముఖ్యమంత్రి స్టాలిన్, చేపాక్ నుంచి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తిరిగి ఎన్నిక చేస్తున్నారు. ఆయన 2021లో చేపాక్‌లో తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేయనున్న డీఎంకే అభ్యర్థుల తొలి జాబితాను స్టాలిన్ విడుదల చేశారు. కొయంబత్తూర్ సౌత్ నుంచి మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ బరిలోకి దిగారు. బోడినాయగనూర్ నుంచి పన్నీర్‌సెల్వం పోటీలో ఉన్నారు. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరగనుంది. కౌంటింగ్ మే 4న ఉంటుంది.

## దేశ భద్రతకు బెంగాల్ ఎన్నికలు కీలకం

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**కోల్‌కత, మార్చి 28 (వుదయం) :**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, శనివారం నాడు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తృణమూల్ ప్రభుత్వంపై ఒక చార్జిషీటును విడుదల చేయడం ద్వారా తమ పార్టీ ప్రచారాన్ని ఉధృతం చేశారు. అంతేకాక, ఈ ఎన్నికలను కేవలం రాష్ట్రం కోసమే కాకుండా, దేశ భద్రత కోసం జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. కోల్‌కతాలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన షా, ఆ పార్టీ సాగించిన 15 ఏళ్ల పాలనలో ఈ రాష్ట్రం అక్రమ చొరబాట్లు, బుజ్జగింపు రాజకీయాలు, సరిహద్దు అభద్రతకు దేశంలోనే ప్రధాన కారిడార్‌గా మారిందని ఆరోపించారు.
బెంగాల్ ఎన్నికలు కేవలం ఈ రాష్ట్రానికి మాత్రమే కాక, యావత్తు దేశానికి కూడా ఎంతో కీలకం. ఒక రకంగా చెప్పాలంటే, దేశ భద్రత బెంగాల్ ఎన్నికలతో ముడిపడి ఉంది, అని షా పేర్కొన్నారు.
అసెంబ్లీ ఎన్నికల ముందు అధికార పక్షంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను ప్రస్తావిస్తూ, బెంగాల్‌లో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ ప్రభుత్వంపై అపూర్వ రీతిలో విరుచుకుపడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, అవినీతి, సిండికేట్ రాజ్ విషయంలో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉంది. ఈ రాష్ట్రం అవినీతికి ఒక ప్రయోగశాల లాగా తయారైందని షా అభివర్ణించారు. బెంగాల్ ఎన్నికలు కేవలం ఆ రాష్ట్రానికే కాకుండా, యావత్తు దేశానికి కూడా ఎంతో కీలకం. ఒక రకంగా చెప్పాలంటే, దేశ భద్రత బెంగాల్ ఎన్నికలతో ముడిపడి ఉంది, అని షా అన్నారు.
భారీ ఎత్తున అవినీతి ఆరోపణలపై జైలు పాలైన నాయకులను తృణమూల్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో బరిలోకి దింపింది. ఆ పార్టీ అబద్ధాలు, హింసతో కూడిన రాజకీయాల ఆధారంగా నడుస్తోంది. మమతా దీదీ కొన్నిసార్లు తన విరిగిన కాలు, తలకు తగిలిన గాయం గురించి అబద్ధాలు చెబుతుంటారు; అంతేకాకుండా, తరచుగా ఎన్నికల సంఘంపై విమర్శల దాడికి దిగుతుంటారు, అని అధికార పార్టీపై షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.
అస్సాంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆ రాష్ట్రం గుండా సాగే చొరబాటు మార్గాలు మూసివేశామని, చొరబాటుకు ఇప్పుడు పశ్చిమ బెంగాల్ మాత్రమే మిగిలి ఉన్న ఏకైక మార్గం అని షా పేర్కొన్నారు. చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశించి అలజడులు సృష్టిస్తున్న ఏకైక రాష్ట్రం పశ్చిమ బెంగాల్ మాత్రమే, అని ఆయన అన్నారు.
శనివారం, కోల్‌కతలో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగించారు.
సర్ విషయంలో కేవలం పశ్చిమ బెంగాల్‌కే ఎందుకు సమస్య ?: అమిత్ షా ప్రశ్నించారు.
టిఎంసి అనుసరిస్తున్న తుష్టీకరణ, ఓటు బ్యాంకు రాజకీయాలకు ఈ అంశాన్ని పదేపదే ముడిపెట్టారు; సరిహద్దు నిర్వహణను బలోపేతం చేసే ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని ఆయన ఆరోపించారు.
కేంద్రం నుండి పదేపదే అభ్యర్థనలు వచ్చినప్పటికీ, సరిహద్దు కంచె నిర్మాణానికి మమతా బెనర్జీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని షా ఆరోపించారు. ఈ నిరాకరణ రాజకీయంగా ప్రేరేపితమైనది అని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉన్న తమ ఎన్నికల ప్రణాళిక లేదా సంకల్ప పత్రంలో, తృణమూల్ కాంగ్రెస్ ఆరోపిత లోపాలను ఎత్తిచూపడానికి, ప్రత్యామ్నాయాలను ప్రదర్శించడానికి కాషాయ పార్టీ ఈ ఛార్జ్‌షీట్ 'ను ఉపయోగించుకోవాలని యోచిస్తోంది.
మీరు ఎవరిని ఎన్నుకోవాలనుకుంటున్నారు భీభత్సాన్ని, హింసను ప్రేరేపించే పార్టీనా, లేక విశ్వాసం, స్థిరత్వం, సుపరిపాలనను అందించే పార్టీనా? బీజేపీ బెంగాల్‌లో సుపరిపాలనను అందిస్తుంది. మేము అంగా (అస్సాం), కళింగ (ఒడిశా) గెలిచాం, ఇప్పుడు బంగను గెలుస్తాం," అని ఆయన అన్నారు.
బెంగాల్‌లో మహిళలు సురక్షితంగా లేరు. ఇక్కడ ఆర్.జి. కార్ ఆసుపత్రి, కామ్దుని, హన్స్‌ఖాలిలలో అత్యాచారాలు, హత్యల వంటి దిగ్భ్రాంతికరమైన సంఘటనలు జరిగాయి. పార్క్ స్ట్రీట్ అత్యాచార కేసు కల్పితమని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం కంటే కమ్యూనిస్టు పాలనే మెరుగ్గా ఉండేదని ఈ రాష్ట్ర ప్రజలు అంటారు, అని ఆయన విలేకరులతో అన్నారు.
ఇటీవల బెంగాల్ పర్యటనలో గౌరవనీయ రాష్ట్రపతిని కూడా ఆమె వదల్లేదు. ఆమె గిరిజన వర్గానికి చెందినప్పటికీ, ఆమెను అవమానించారు. మమతా దీదీ ఎన్నికల సమయంలో ఎప్పుడూ బాధితురాలి కార్డును ఉపయోగించడానికి ప్రయత్నిస్తారు. సమస్యలపై చర్చించడానికి నేను ఆమెను చాలాసార్లు సంప్రదించడానికి ప్రయత్నించాను కానీ విఫలమయ్యాను. నాతో మాట్లాడటానికి ఆమెకు తీరిక లేదు. ఆమె భయం, తీవ్రవాదం, విభజన రాజకీయాలతో కూడిన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు, అని కేంద్ర హోం మంత్రి ఆరోపించారు.
ఎన్నికల ఓటర్ల జాబితాకు సంబంధించి జరుగుతున్న ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియపై మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కొనసాగుతున్న ఇతర 14 రాష్ట్రాల్లో ఎక్కడా ఎటువంటి కోర్టు కేసులు దాఖలు కాలేదు. కానీ కేవలం బెంగాల్‌లో మాత్రమే ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా కేసులు దాఖలయ్యాయి. పత్రాల పరిశీలన బాధ్యతలను నిర్వహించడానికి న్యాయాధికారులను నియమించారు. కేరళ, తమిళనాడు వంటి బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో కూడా, ఎటువంటి వ్యతిరేకత లేకుండా సర్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. బెంగాల్‌లో మాత్రం, సర్‌ను వ్యతిరేకించే ముసుగులో అక్రమ ముస్లిం ఓటర్లను కాపాడాలని ఆమె భావిస్తున్నారు, అని ఆయన వ్యాఖ్యానించారు.
టిఎంసి అధికారంలోకి రావడానికి అబద్ధాలు, భయం, హింస మూలంగా ఉన్నాయి. అయితే 2011 నుండి బీజేపీ దీనికి వ్యతిరేకంగా పోరాడుతోంది, ఈసారి బెంగాల్‌లో బీజేపీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను, అని ఆయన అన్నారు.
బెంగాల్ ఎన్నికలు ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. ఈ రెండు దశల ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

## రాష్ట్రం తర్వాత ఢిల్లీనే మా లక్ష్యం

### మమతా బెనర్జీ



**కోల్‌కత, మార్చి 28 (వుదయం) :**
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్‌లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే భాజపా దేశంలో అధికారాన్ని కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం దిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకువెళ్తానన్నారు. బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.
రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఆరోపించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ భాజపా నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను భాజపా పావులా వాడుకుంటోందన్నారు. రాష్ట్రంలో భాజపా ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు.
రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితో పాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## గగనతలంలో ఇంజిన్ సమస్య

### ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర పరిస్థితి



**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :**
శనివారం ఉదయం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక విమానం అత్యవసర ల్యాండింగ్ కావడంతో, అత్యవసర సేవల సిబ్బంది తక్షణమే స్పందించారు. ఢిల్లీ అగ్నిమాపక సేవల ఇచ్చిన వివరాల ప్రకారం, ఉదయం 10:53 గంటలకు ఈ అత్యవసర పరిస్థితికి సంబంధించిన సమాచారం అందింది; దీనితో ముందు జాగ్రత్త చర్యగా అనేక అగ్నిమాపక వాహనాలను వెంటనే విమానాశ్రయానికి పంపారు.

**తక్షణ అత్యవసర ప్రతిస్పందన**
ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి , సంభావ్య ప్రమాదాలను ఎదుర్కోవడానికి సిబ్బందిని ఆలస్యం లేకుండా సమీకరించినట్లు అగ్నిమాపక అధికారులు ధృవీకరించారు. అగ్నిమాపక వాహనాలను వేగంగా మోహరించడం వల్ల విమానం రావడానికి ముందే రన్‌వే ప్రాంతాన్ని సురక్షితం చేయడానికి అది సహాయపడింది. ప్రామాణిక అత్యవసర నిబంధనలను పాటిస్తూ, ల్యాండింగ్ ప్రక్రియ సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉన్నారు.

**సురక్షిత ల్యాండింగ్**
విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని, ఎటువంటి గాయాలు లేదా నష్టం జరగలేదని డిఎఫ్ ఎస్ పేర్కొంది. ప్రయాణీకులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని ధృవీకృతమైంది. అత్యవసర ల్యాండింగ్‌కు గల కచ్చితమైన కారణాన్ని ఇంకా వెల్లడించలేదు, మరిన్ని వివరాల కోసం విమానయాన అధికారులను సంప్రదించాల్సి ఉంది.
పరిస్థితి అదుపులో ఉంది: ప్రామాణిక భద్రతా విధానాలకు మించి ఎటువంటి అంతరాయం లేకుండా, పరిస్థితిని సమర్థవంతంగా చక్కదిద్దినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం విమానాశ్రయ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి. సాధారణ భద్రతా విధానాలకు మించి ఎటువంటి అంతరాయం లేకుండా, పరిస్థితిని సమర్థవంతంగా నిర్వహించామని అధికారులు తెలిపారు.

## 50 శాతం విమానాల్లో పునరావృతమయ్యే లోపాలు

### తీవ్రంగా దెబ్బతిన్నఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్: నివేదిక



**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :**
అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత, భారతదేశ విమానయాన రంగంలో వాణిజ్య విమానాలలో లోపాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఒక పార్లమెంటరీ ప్యానెల్ తీవ్రమైన భద్రతా సమస్యలను ఎత్తిచూపుతూ, దేశ భద్రతా వ్యవస్థను సమూలంగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చిందని ఎన్డీటీవీ పేర్కొంది. పౌర విమానయాన స్థాయీ సంఘం తాజా నివేదికల ప్రకారం, జనవరి 2025 నుండి ఫిబ్రవరి 2026 మధ్యకాలంలో మొత్తం 754 వాణిజ్య విమానాలను తనిఖీ చేశారు. ఈ 754 విమానాలలో, ఏకంగా 377 విమానాలలో పదేపదే సాంకేతిక లోపాలు తలెత్తాయి. ఈ నివేదికను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధారంగా రూపొందించారు.
పునరావృతమయ్యే సాంకేతిక లోపాల జాబితాలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అగ్రస్థానంలో నివేదికల ప్రకారం, అత్యధిక లోపాలు ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లోనే కనుగొన్నారు. మొత్తం 166 ఎయిర్ ఇండియా విమానాలను తనిఖీ చేయగా, వాటిలో 137 విమానాలలో పునరావృతమయ్యే సాంకేతిక లోపాలు ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు, ఈ కాలవ్యవధిలో తనిఖీ చేసిన 101 ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలలో 54 విమానాలలో నిరంతర సాంకేతిక సమస్యలు ఉన్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తరువాత, 2025 జూలై 1 నుండి 4 మధ్య ఎయిర్ ఇండియాపై డీజీసీఏ ఒక వివరణాత్మక ఆడిట్‌ను జారీ చేసింది. ఇందులో తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోవాల్సిన ఏడు లెవెల్ 1 ఉల్లంఘనలతో సహా, సుమారు 100 భద్రతా లోపాలను గుర్తించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, బోయింగ్ 787 777 విమానాలకు సంబంధించి పైలట్లకు ఇచ్చే పునరావృత శిక్షణలో ఉన్న లోపాలు, కనీసం నాలుగు అంతర్జాతీయ విమానాలలో క్యాబిన్ సిబ్బంది కొరత, ఫ్లైట్ డ్యూటీ సమయ పరిమితుల ఉల్లంఘనలను ఈ ఆడిట్ వెలుగులోకి తెచ్చింది. మిలన్ నుండి న్యూఢిల్లీకి వెళ్లాల్సిన ఒక విమానం, అనుమతించిన పరిమితిని మించి రెండు గంటలకు పైగా ఆలస్యమైంది. భద్రతాపరమైన ఆందోళనల కారణంగా డీజీసీఏ, ఎయిర్ ఇండియాకు తొమ్మిది షో కాజ్ నోటీసులను జారీ చేసిందని కమిటీ పేర్కొంది.
డిసెంబర్ 2025లో చెల్లుబాటు అయ్యే ఎయిర్‌వర్తినెస్ రివ్యూ సర్టిఫికేట్ లేకుండా ఎనిమిది ఫ్లైట్లలో ఎయిర్‌బస్ ఎ320ను నడిపినందుకు, డీజీసీఏ ఎయిర్ ఇండియాపై సుమారు రూ. 1 కోటి జరిమానా విధించింది. విమానయాన రంగంలో ఖాళీల రేటు 48.3 శాతానికి పెరగడం ఆందోళన కలిగించే విషయమని కూడా ఈ కమిటీ పేర్కొంది. ఇంత ఎక్కువ ఖాళీల రేటుతో విమానయాన రంగాన్ని విస్తరించేందుకు ఆ సంస్థకు తగినంత సామర్థ్యం ఉందా అని కమిటీ డీజీసీఏను ప్రశ్నించింది.

### గత ఏడాది భీకర జెన్ జీ నిరసనల కేసులో

## నేపాల్ మాజీ ప్రధాని ఓలీ అరెస్టు



**వుదయం డెస్క్, మార్చి 28:**
దేశ నూతన ప్రధానమంత్రిగా బాలేంద్ర షా ప్రమాణ స్వీకారం చేసిన సరిగ్గా ఒక్క రోజు తర్వాత, గత ఏడాది జరిగిన భీకర జెన్ జీ నిరసనల్లో ఆయన ఆరోపిత పాత్రకు నేపాల్ మాజీ ప్రధాని కె.పి. శర్మ ఓలి అరెస్టు కావడం, నాటకీయ పరిణామాలకు దారితీసింది.
దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన, పలువురి మరణాలకు దారితీసిన నిరసనల దర్యాప్తులో ఒక కీలక పరిణామంగా, ఓలిని ఆయన మాజీ హోం మంత్రి రమేష్ లేఖక్‌తో పాటు అదుపులోకి తీసుకున్నారు.
"వారిని ఈ ఉదయం అరెస్టు చేశారు, చట్టం ప్రకారం తదుపరి ప్రక్రియ ముందుకు సాగుతుంది," అని ఖాఠ్మండు లోయ పోలీసు ప్రతినిధి ఓం అధికారి తెలిపారని ఎఎఫ్‌పి పేర్కొంది.
కాగా, తన అరెస్టు ప్రతీకార చర్య అని, దీనిని చట్టపరంగా సవాలు చేస్తానని నేపాల్ మాజీ ప్రధాని ఓలీ పేర్కొన్నారు. గత ఏడాది చోటు చేసుకున్న హింసాత్మక ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల అనంతరం నేపాల్ సున్నితమైన రాజకీయ పరివర్తన దశలో ఉన్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకుంది.
ఈ అరెస్టు ప్రతీకార చర్యే. దీనిని నేను న్యాయపరంగా ఎదుర్కొంటాను, మీరందరూ సిద్ధంగా ఉండండి," అని ఓలి తన న్యాయవాదులతో చెప్పినట్లు నేపాలీ వార్తా సంస్థ ఆన్‌లైన్ ఖబర్ తెలిపింది. ఈ హింసాకాండలో తనకు ఎటువంటి పాత్ర లేదని ఓలి ఖండించినట్లు కూడా ఆ సంస్థ పేర్కొంది.
ఓలీ పార్టీ అయిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్‌లెనినిస్ట్) నాయకులు ఈ అరెస్టుకు గల ప్రాతిపదికను ప్రశ్నించారు. ఈ దర్యాప్తు నివేదికలో తగినంత ఆధారాలు లేవని పార్టీ సీనియర్ సభ్యుడు రఘుజీ పంత్ పేర్కొంటూ, ఇది ఉద్దేశ్యపూర్వకంగానే రూపొందించినట్లు ఆరోపించారు.

## నెలరోజుల యుద్ధంలో అగ్రనాయకులను కోల్పోయిన ఇరాన్



**వుదయం డెస్క్, మార్చి 28:**
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భారీ సైనిక చర్యను ప్రారంభించిన ఒక నెల తర్వాత కూడా, ఆ విధ్వంసం, రాజకీయ అలజడి తాలూకు ప్రభావం ఆ ప్రాంతమంతటా ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉంది. 2026 ఫిబ్రవరి 28న వరుస సమన్వయ, కచ్చితమైన దాడులుగా ప్రారంభమైన ఈ పరిణామం ఇటీవలి పశ్చిమ ఆసియా చరిత్రలోనే అత్యంత కీలకమైన సంఘర్షణలలో ఒకటిగా రూపుదిద్దుకుంది.
తొలి దాడులు టెహ్రాన్‌లో, ఇతర ప్రాంతాలలో ఉన్న కీలక సైనిక స్థావరాలు, నాయకత్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఇది ఇరాన్ కమాండ్ వ్యవస్థను కూల్చివేయడానికి జరుగుతున్న ఒక వ్యూహాత్మక ప్రయత్నానికి సంకేతం. అత్యున్నత అధికార స్థాయిలో ఆ దేశం అపూర్వమైన నష్టాలతో సతమతమవుతున్న తరుణంలో, ఈ దాడులు కేవలం సైనికంగానే కాకుండా రాజకీయంగా కూడా ఒక మలుపు అని చెప్పవచ్చు.

**తొలి దాడి ఇరాన్ నాయకత్వాన్ని కుదిపేసింది**
తొలి విడత దాడుల్లో మరణించిన వారిలో 1989 నుండి ఇస్లామిక్ రిపబ్లిక్‌కు నాయకత్వం వహించిన అలీ ఖమేనీ కూడా ఉన్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)కు చెందిన పలువురు సీనియర్ కమాండర్లతో పాటు ఆయన మరణం, తక్షణమే ఒక నాయకత్వ శూన్యతను సృష్టించింది.
ఇరాన్ సైనిక, గూఢచార వ్యూహాలను దీర్ఘకాలంగా పర్యవేక్షిస్తున్న అగ్రశ్రేణి వ్యక్తులనే ఈ ఆపరేషన్ ఉద్దేశ పూర్వకంగా లక్ష్యంగా చేసుకుందని ఇజ్రాయెల్ ధృవీకరించింది. కొద్ది రోజుల్లోనే, ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా అనుకూల దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులతో ప్రతిస్పందించి, ఈ ఘర్షణను ఒక విస్తృత ప్రాంతీయ సంఘర్షణగా మార్చింది.
మార్చి 8న, టెహ్రాన్‌లోని అధికారులు మొజ్తబా ఖమేనీ సర్వోన్నత నాయకుడిగా బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకటించారు; గందరగోళం మధ్య కొనసాగింపును కాపాడే ప్రయత్నంగా ఈ చర్యను పరిగణించారు.

**వ్యూహాత్మక ఆస్తులే లక్ష్యంగా దాడి**
నాయకత్వానికి అతీతంగా, ఈ దాడులు ఇరాన్ ఆర్థిక, వ్యూహాత్మక వెన్నెముక వరకు విస్తరించాయి. దేశ ప్రాథమిక చమురు ఎగుమతి టెర్మినల్ అయిన ఖర్గ్ ద్వీపం, ప్రపంచంలోని అతిపెద్ద సహజ వాయు నిల్వలలో కీలకమైన సౌత్ పార్స్ వంటి ముఖ్యమైన ప్రదేశాలపై దాడులు జరిగాయి.
అంతేకాకుండా, తమ అణు ఆశయాలు శాంతియుతమైనవని టెహ్రాన్ చాలా కాలంగా నొక్కి చెబుతున్నప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన అనేక ప్రదేశాలపై కూడా దాడులు జరిగాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను, సైనిక కార్యకలాపాలను కొనసాగించే దీర్ఘకాలిక సామర్థ్యాన్ని బలహీనపరచడమే ఈ దాడుల లక్ష్యమని విశ్లేషకులు సూచిస్తున్నారు.

### మృతులలో ఉన్నత కమాండర్లు

యుద్ధం ప్రారంభమైన మొదటి నెలలోనే ఇరాన్ సైనిక, రాజకీయ వ్యవస్థలలోని ఉన్నతాధికారులు భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. మరణించినట్లు ధృవీకరించిన వారిలో
- అలీ ఖమేనీ - ఇరాన్ సర్వోన్నత నాయకుడు
- అలీ లారిజానీ - సర్వోన్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి
- అజీజ్ నసీర్‌జాదే - రక్షణ మంత్రి
- అబ్దుల్ రహీమ్ మౌసావి - చీఫ్ ఆఫ్ స్టాఫ్
- మొహమ్మద్ పక్‌పూర్ - ఐఆర్‌జిసి పదాతి దళాల కమాండర్
- ఘోలమ్రెజా సోలేమానీ - బసీజ్ కమాండర్
- అలీరెజా తంగ్సిరి - నావికాదళ కమాండర్
- మొహమ్మద్ షిరాజీ - సైనిక బ్యూరో అధిపతి
- అక్బర్ ఇబ్రహీమ్‌జాదే - సర్వోన్నత నాయకుడి కార్యాలయ ఉప అధిపతి
- ఘోలమ్రెజా రెజాయియాన్ - ఇంటెలిజెన్స్ అధిపతి (ఫరాజా)
- బహ్రామ్ హొస్సేనీ మోట్లాగ్ - ప్రణాళిక, ఆపరేషన్స్ అధిపతి
- హసనాలి తాజిక్ - లాజిస్టిక్స్ అధిపతి
- సలేహ్ అసది - సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి ఉన్నారు.

ఈ సంచిత ప్రభావం కారణంగా, ఇరాన్ క్రియాశీల పోరాటంలో కొనసాగుతూనే, తన కమాండ్ వ్యవస్థను పునర్నిర్మించుకోవడానికి తీవ్రంగా సతమతమవుతోంది.

**పెరుగుతున్న పౌరుల మరణాలు**
మానవతా సంక్షోభం తీవ్రంగా ఉంది. ఇరాన్‌లోని మానవ హక్కుల కార్యకర్తల ప్రకారం, మార్చి 26 నాటికి కనీసం 3,329 మంది మరణించారు, వీరిలో 1,492 మంది పౌరులు ఉన్నారు. వీరిలో 221 మంది చిన్నారులు కూడా ఉన్నారు. పౌర మౌలిక సదుపాయాలను అమెరికా, ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నాయని ఇరాన్ ఆరోపించింది. ముఖ్యంగా, ఫిబ్రవరి 28న దక్షిణ ఇరాన్‌లోని ఐఆర్‌జిసి స్థావరం సమీపంలో ఉన్న ఒక బాలికల పాఠశాలపై దాడి జరిగిందని, ఈ దాడిలో సుమారు 110 మంది చిన్నారులతో సహా 168 మంది మరణించారని టెహ్రాన్ పేర్కొంది. ఈ సంఘర్షణ రెండో నెలలోకి ప్రవేశించగా, ఉద్రిక్తతలను తగ్గించడానికి స్పష్టమైన మార్గం లేకపోవడం, భౌగోళిక రాజకీయ పరిణామాలు కొనసాగుతుండటంతో ఈ ప్రాంతం ఉద్రిక్తంగానే ఉంది.




# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

### - మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష



**వుదయం ప్రతినిధి, ఆదిలాబాద్:** పట్టణ పరిశుభ్రతతో పాటు త్రాగు నీటిని సరఫరా చేయడములో పారిశుద్ధ, వాటర్ సప్లై కార్మికుల పాత్ర కీలకమని, విధుల పట్ల నిర్లక్ష్యం తగదని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. శనివారం ఉదయం 5 గంటలకు స్వయంగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సానిటేషన్ వర్కర్ల హాజరు పట్టిక ను పరిశీలించారు. దీంతోపాటే వాటర్ సెక్షన్ లో కూడా హాజరు పట్టికను పరిశీలించి రోజువారిగా విధులకు హాజరు కావాలని సూచించారు. ఎంతమంది విధుల్లో ఉన్నారు.. ఎంతమంది సెలవుల్లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష సతీష్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సానిటేషన్ కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. వీరితో పాటే వాటర్ సప్లై సిబ్బందిది కూడా అంతే పాత్ర ఉంటుందన్నారు. ఈ కార్మికుల కోసం ప్రతి నెల వేతనాల రూపంలో 78 లక్షల రూపాయలను చెల్లించడం జరుగుతుందన్నారు. అయితే కొందరు మట్టుకు కార్మికులు విధులకు గైర్హాజరు అవుతున్నట్లు తన పరిశీలనలో తెలిసిందన్నారు. గతంలో ఎవరు పట్టించుకోని కారణంగా కొందరు ఇష్టారితిన కార్మికులు విధులకు హాజరయ్యేవారన్నారు. ఇకనుండి అలా జరగకుండా చూసుకోవలాని హెచ్చరించారు. అవసరం లేని వారిని వేరే వాటికి సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు నీటిని వృధా చేయకుండా మితంగా వాడుకోవాలని, ఎంత నీరు అవసరమో అంతే పట్టుకున్నట్లయితే వెరే వారికి నీరు అందే అవకాశం ఉంటుందని అన్నారు. నీటి వృధాను నివారించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.నీటి సరఫరా సక్రమంగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా శాలరీలు , పిఎఫ్ డబ్బులను వెంటవెంటనే వారి వారి అకౌంట్లో జమ చేయాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ కార్మికులకు సంబంధించిన సబ్బులు , డిటర్జెంట్లు , నూనెలు, గ్లౌజులు , ఆఫ్రాన్లను అతి త్వరలో కౌన్సిల్ తీర్మానం తీసుకొని అందించాలని, అధికారులు, కార్మికులకు ఎక్కడ సమస్య ఉన్ననేరుగా సంప్రదించాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.

## సకాలంలో రోడ్డు నిర్మాణ..

## పనులు పూర్తి చేయాలి

### ఆర్&బీ శాఖ అభివృద్ధి పనులపై అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమావేశం

**పెద్దపల్లి, (వుదయం ప్రతినిధి)** ఆర్&బీ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆర్&బీ శాఖ అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి కాటారం పరిధిలో జరుగుతున్న రొడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. లింగాపూర్ రొడ్డు సంబంధించి విస్తరణ పనులు, మీడియన్, పైప లైన్ పనులు చేయాలని అన్నారు. రొడ్డు విస్తరణ పనులు సంబంధించి విద్యుత్ పోల్స్ తరలింపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి లో నిర్మించిన ఆర్&బీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, సంబంధిత వివరాలను ఎంబీ రికార్డులలో నమోదు చేసి బిల్లులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. మానేరు నది పై చేపట్టిన బ్రిడ్జి టెండర్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రోడ్లు నిర్మించే సమయంలో త్రాగు నీటి పైప్ లైన్ పనులకు డ్యామేజి జరుగకుండా చూడాలని అన్నారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. కునారం ఆర్ఓబి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూ సేకరణ పూర్తి చేశామని, అక్కడ ఇండ్ల, ఇతర నిర్మాణాల కూల్చివేత పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని స్టేడియం నిర్మాణానికి సంబంధించి అవసరమైన అనుమతులు త్వరగా సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, డీఈలు, ఏఈలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు



## 7న రాజన్న కోడెలు పంపిణీ

### కలెక్టర్ గరీమా అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, (వుదయం ప్రతినిధి)** వచ్చే నెల (ఏప్రిల్)7వ తేదీన వేములవాడ పరిధి తిప్పాపూర్ లోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని మధ్యస్థం నుంచి పెద్దగా ఉన్న 300 కోడెలు మంగళవారం ఉదయం 07.00 గంటలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్న కారు రైతులు అర్హులని, వారు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్, తమ సమీప మండల వ్యవసాయ అధికారి/ ఏఈఓ నుంచి ధ్రువపత్రం, ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారుఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో వచ్చే నెల (ఏప్రిల్ ) 7వ తేదీన మంగళవారం ఉదయం 07.00 గంటలకు వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలకు కోడెల కోసం రావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ సక్రమంగా చూసుకోవాలని సూచించారు. పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అగ్రవాల్ హెచ్చరించారు.





## పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):** మద్నూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష వ్రాస్తున్న విద్యార్థుల హాజరు శాతం, సౌకర్యాల పై విద్యా శాఖ అధికారి రాజు ను అడిగి తెలుసుకొని, పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య , భద్రత దృష్ట్యా వైద్య సిబ్బంది, అవసరమైన మెడిషన్ ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి



**కరీంనగర్ (వుద యం ప్రతినిధి):** వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేసేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కళాభారతిలో శనివారం రోజు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, సానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది, వార్డు అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. 202526 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో వంద శాతం ఆస్తి పన్నుల వసూలు, మొండి బకాయి ధారులపై చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు, కమర్షియల్ ప్రాపర్టీలు, కమర్షియల్ రెసిడెన్షియల్ రెండు కలిసి ఉన్న ప్రాపర్టీలు, రివిజన్ పిటిషన్లు, డబుల్ నెంబర్స్ ప్రాపర్టీలు, ఆర్ ఆర్ ఆక్ట్ తదితర అంశాలపై అధికారులు సిబ్బందితో కమీషనర్ సుదీర్ఘంగా చర్చించారు. అధికారులు, వార్డు ఆఫీసర్ల వారిగా కలెక్షన్ వివరాలతో పాటు ఫీల్డ్ లెవల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్నుల వసూలు పై పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్ళలో అధికారులు, సిబ్బంది, వారెంట్ ఆఫీసర్లు, వార్డు ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిణ చర్యలు తప్పవన్నారు. విధి నిర్వహణ సక్రమంగా లేని అధికారులకు షోకాజు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిగిలిన మూడు రోజుల గడువు ప్రతి రోజు దాదాపు రెండున్నర కోట్ల టార్గెట్ గా ఆస్తి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. టాప్ 200 మొండి బకాయి దారులతో పాటు కమర్షియల్, మిక్సుడ్, డబుల్ నెంబర్ ప్రాపర్టీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్డు ఆఫీసర్లకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం కనీసం 95 శాతంకు తగ్గకుండా టార్గెన్ పూర్తి చేయాలని ఆదేశించారు. అంతే కాకుండా ప్రభుత్వ ప్రాపర్టీల పన్నుల పై కూడ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉదయం 6 నుండి రాత్రి వరకు ప్రతి అసెస్మెంట్ ను విజిట్ చేసి పన్నులు కట్టించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మొండి బకాయి దారులు పన్నులు చెల్లించకుంటే చట్ట ప్రకారం ప్రాపర్టీలను సీజ్ చేయాలని ఆదేశించారు. అంతే కాకుండా ప్రాపర్టి టాక్స్ చెల్లించని వారి నల్లా కనెక్షన్లు, పవర్ కనెక్షన్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డబుల్ ఇంటి నెంబర్లు ఉన్న ప్రాపర్టీలకు సంబంధించి పాత ఇంటి నెంబర్ ఆస్తి పన్ను తో పాటు నూతనంగా ఇచ్చిన నెంబర్ పన్నులు కూడ కట్టించాలన్నారు. ఆర్ ఆర్ ఆక్టును తప్పక అమలు చేయాలన్నారు. రెడ్ నోటీసుల గడువు ముగిన బకాయి దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గడువు లోగా డిమాండ్ ప్రకారం పన్ను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీసీలు ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, అధికారులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో 108 అంబులెన్స్ తనిఖీ

### సేవల నాణ్యతపై ఆకస్మిక సమీక్ష - ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్



**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):** మండల కేంద్రంలోని 108 అంబు లెన్స్ సేవల తీరుతెన్నులను శని వారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ భూమా.నాగేందర్,జగిత్యాల జిల్లా మేనేజర్ అశోదా. ఐలయ్య కలిసి అంబులెన్స్‌ను సందర్శించి, అందులోని వైద్య పరికరాల పని తీరును స్వయం గా పరిశీలించారు.ఈ తనిఖీల్లో భాగంగా అంబులెన్స్‌లో ఉన్న అత్యవసర వైద్య పరికరాలు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని అధికా రులు పరీక్షించారు. అనంతరం నిర్వహ ణ రికార్డులను సమీక్షించి,రోగు లకు అందుతున్న సేవల నాణ్య తపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగాప్రోగ్రాం మేనేజర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలకు ఏమాత్రం జాప్యం లేకుండా,అత్యంత వేగంగా, సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ప్రతి నిమిషం విలువైనదని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది ఈఎంటీ అనీల్,పైలట్ ఖయుమ్, పాల్గొన్నారు

## కుక్క అడ్డు రావడంతో భార్యాభర్తలకు గాయాలు



**శంకరపట్నం : వుదయం ప్రతినిధి** శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన శనిగరపు సంపత్ 38 మరియు అతని భార్య మౌనికతో కలిసి ఉదయం గద్దపాక నుండి చిగురుమామిడి వాళ్ల మేనత్త దహన సంస్కారాలకు వెళ్లి తిరిగి వస్తుండగా చిగురుమామిడి నుండి గద్దపాక కు వస్తుండగా మార్గమధ్యలో కేశపట్నం ఒక్కసారిగా సంపత్ మౌనికలు మోటార్ సైకిల్ మీద నుండి కింద పడ్డారు. 108 కి ఫోన్ చేయడంతో 108 సిబ్బంది ఈఎంటి గూడూరు సతీష్ రెడ్డి పైలెట్ ఎం గోపికృష్ణ అంబులెన్స్ లోనికి తీసుకొని ప్రథమ చికిత్స అందిస్తూ హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది

## మున్సిపల్ బడ్జెట్ రూ.25 కోట్ల74 లక్షల 89 వేలు




**లక్షెట్టిపేట, (వుదయం ప్రతినిధి):** మున్సిపాలిటీ 202627 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం బడ్జెట్ రూ. 25 కోట్ల 74 లక్షల 89 వేలుగా శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) చంద్రయ్య, చైర్ పర్సన్ దొంత అంజలి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం లో సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ మొత్తం రెవెన్యూ ఆదాయం రూ. 3 కోట్ల 42 లక్షల 63 వేలు కాగా, వీటిలో సిబ్బంది జీతాల కోసం రూ. కోటి 70 లక్షలు, పారిశుద్ధ్య నిర్వహణ రూ. 51 లక్షల 98 వేలు, కరెంటు చార్జీలు రూ. 6 లక్షలు, రుణాల చెల్లింపులు రూ. 20 లక్షలు, గ్రీన్ బడ్జెట్ రూ. 33లక్షల 60 వేలు, ఇంజినీరింగ్ నిర్వహణ రూ. 17 లక్షలు, పరిపాలన రూ. 42.55 లక్షలు, టౌన్ ప్లానింగ్ రూ. 1 లక్ష 50 వేలు, డిపాజిట్స్, అడ్వాన్స్ లు రూ.9 లక్షలుగా ఆమోదించారు. కాగా, రూ. 21 కోట్ల 42 లక్షల 26 వేలను పలు రకాల గ్రాంట్ ఆదాయంగా అంచనా వేశారు. మొత్తం రూ. 25 కోట్ల 80 లక్షల 84 వేలు గా మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ కు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) చంద్రయ్య మాట్లాడుతూ ఈ అంచనా బడ్జెట్ ను సభ్యులు సక్రమంగా అర్థం చేసుకోవాలని, అదే విధంగా ప్రతి కౌన్సిలర్ తమ వార్డ్ లలో ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మున్సిపాలిటీ ఆదాయంను పెంచే మార్గాలను పాటించాలన్నారు. చైర్ పర్సన్ దొంత అంజలి నర్సయ్య వైస్ చైర్ పర్సన్ మోతుకూరి రాజేశ్వరివెంకటస్వామి గౌడ్,మున్సిపల్ కమీషనర్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు, మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన సముద్రాల శ్రీనివాస్



**కరీంనగర్ (వుదయం ప్రతినిధి );** తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మొదటిసారి కలిసి శ్రీరామ నవమి సందర్భంగా పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం రోజున మీడియాకు పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఎంఎస్ ఆర్థోపెడిక్ సర్జన్ గా సిద్ధిపేట జిల్లా కేంద్రంలో ప్రజలకు వైద్య సేవలుఅందిస్తున్నట్లు డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ నాయకులు మేయర్ కొలకాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాం కిరణ్ లతో కలిసి మహాశక్తి ఆలయం లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో , పూజా కార్యక్రమాల్లో పాల్గొని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని కేంద్ర మంత్రితో పేర్కొన్నట్లు తెలిపారు.మొగిలిపాలెం బీజేపీ నాయకులు ఎర్రోజు లక్ష్మణ్ శ్రీనివాస్ వెంట ఉన్నారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

### రూ.5 లక్షల్లోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం

### కేవలం మూడు నెలల్లోనే పనులన్నీ పూర్తి

### ఫిల్లర్ రూఫింగ్ విధానంలో స్లాబ్ నిర్మాణం



**రాజన్న సిరిసిల్ల, వుదయం ప్రతినిధి** ఇల్లు లేని వారి సొంత ఇంటి కల నిజం చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతుంది. మోడల్ హౌస్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించింది. 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలతో ఇల్లు పూర్తవుతుందని స్పష్టం చేసింది గృహ నిర్మాణ శాఖ. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే నూతన సాంకేతికత, అద్భుతమైన డిజైన్ లో స్లాబ్ తో ఇందిరమ్మ ఇల్లు పక్కాగా నిర్మించింది. ప్రజా ప్రభుత్వం అర్హులైన వారి సొంతింటి కల నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టింది. నిర్దేశించిన 400 నుంచి 600 చదరపు ఫీట్ల వరకు నిర్మించుకోవచ్చని, వారికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో నిర్మాణానికి అనుగుణంగా నేరుగా లబ్ధిదారు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా ఏర్పాట్లు చేసింది. పేదలకు 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలు ఇల్లు నిర్మించుకునేలా స్పష్టమైన కార్యాచరణ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో గృహ నిర్మాణ శాఖ మోడల్ నిర్మాణాలను జిల్లాలో చేపట్టింది.

**జిల్లాలో 11 నిర్మాణాలు పూర్తి..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 11 మోడల్ ఇందిరమ్మ మోడల్ ఇండ్లను 400 చదరపు ఫీట్లలో ఒక ప్రణాళిక ప్రకారం కేవలం మూడు నెలల కాలంలోనే రూ. ఐదు లక్షలతో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**ఇబ్బందులు దూరం చేసేందుకు కమిటీల సేవలు**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో ఒక హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. గోడల నిర్మాణానికి సిమెంటు ఇటుకలు వినియోగించారు. కిటికీలు, దర్వాజలు చెదలు పట్టకుండా చాలా కాలం మన్నికగా ఉండేలా సిమెంటు ఫ్రేములు వినియోగించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి, ఇతర ఇబ్బందులను దూరం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

**ఎండాకాలం చల్లగా.. చలికాలం వెచ్చగా ..**

ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండాకాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. కాంక్రీట్, ఐరన్ తక్కువగా ఉపయోగిస్తారు. స్లాబ్ చూడడానికి కూడా ఎంతో అందంగా కనిపిస్తుంది.

**దీర్ఘకాలం పాటు మన్నికగా ఉండేలా..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 లక్షలలోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. నాణ్యతలో కూడా ఇలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.

**ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ..**

జిల్లాలోని అర్హులైన వారు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఐదు లక్షలతోనే పూర్తిచేసేలా ప్రతి మండల కేంద్రం అలాగే మున్సిపాలిటీలో హౌసింగ్ అధికారులు పూర్తిస్థాయి సహకారం అందిస్తారు. సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకునే అవకాశం ఉంది.

## జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా న్యాయమూర్తి







**కామారెడ్డి, వుదయం ప్రతినిధి ):** కామారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయమూర్తి డా.వరప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో ఏర్పడిన వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక ఉత్తమ వేదిక అని తెలిపారు. అనవసర వివాదాలకు దూరంగా ఉండి, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న, రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాల సమ్మతితో త్వరితగతిన పరిష్కారం పొందేందుకు లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుటుంబ, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో పరస్పర సమ్మతితో రాజీ కుదుర్చుకోవచ్చని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల విషయంలో రూ.25,000 లోపు నష్టం జరిగిన సందర్భాల్లో, కోర్టు అనుమతితో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే రీఫండ్ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి అధికారులు నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. వేగవంతమైన న్యాయ పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. న్యాయమూర్తులు, కామారెడ్డి అదనపు కలెక్టర్ విక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు, కక్షిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మానేరు రివర్ ఫ్రంట్ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కరీంనగర్(వుదయం ప్రతినిధి );** కరీంనగర్ ఎల్.ఎం.డి రిజర్వాయర్ దిగువన నిర్మాణంలో ఉన్న మానేరు రివర్ ఫ్రంట్ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు.మున్సిపల్, రెవిన్యూ, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రివర్ ఫ్రంట్ బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణ అంచనా వ్యయం, పూర్తిచేసిన పనుల వివరాలు, చేయవలసిన నిర్మాణాలు తదితర అంశాలను అధికారులు వివరించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణంలో భాగంగా టూరిజం అభివృద్ధి నమూనా, పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఏయే నిర్మాణాలు ఎంత విస్తీర్ణంలో ఎక్కడ చేపడుతున్నారని విషయాలను గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. నది లోతు, ఇరువైపులా కట్ట నిర్మాణం ఎత్తు, ప్రైవేటు, ప్రభుత్వ భూమి సేకరణ వంటి వివరాలను అడిగారు. పలు అభివృద్ధి పనుల గురించి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కలెక్టర్ కు వివరించారు. మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, నీటిపారుదల శాఖ ఎస్ ఈ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## గర్భిణులు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు
- స్కానింగ్ సెంటర్ల పై నిఘా ఉంచి సమాచారం అందించండి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్





నాగర్ కర్నూల్ మార్చి 28 (వుదయం ప్రతినిధి)

జిల్లాలో గర్భిణీల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్య శాఖ అధికారులకు, ఏఎన్ఎంలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గర్భధారణ సమయంలో మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకు నేలా, ప్రతి నెల నిర్వహించే గర్భిణీలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఏఎన్ఎంలకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ (లింగ ఎంపిక నిషేధం) చట్టం 1994 & నిబంధనలు 1996 పైన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పీహెచ్ సీల ఏఎన్ఎమ్ లకు ఒకరోజు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గర్భిణీ స్త్రీకి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా హై రిస్క్ గర్భిణీ లను ముందుగానే గుర్తించి, వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. హై రిస్క్ ఉన్న గర్భిణీలకు అవసరమైన ల్యాబొరే టరీ పరీక్షలు, మందులు, పోషకాహార సూచనలు అందించి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించడంలో ముందస్తు జాగ్రత్తలే అత్యంత కీలకమైందని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు గర్భిణీ లతో నిరంతరం సంబంధం కొనసాగించాలని, వారిని సమయానికి ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి గర్భిణీ స్త్రీకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య శాఖ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు ప్రతినెల గర్భస్థ ఆరోగ్య పరీక్షలకు హాజరవుతున్నారా లేరా అని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 1వ 2వ 3వ గర్భస్థ పరీక్షల తర్వాత , నెల వారీ ఆరోగ్య పరీక్షలకు హాజరుకాకుంటే అందుకు గల కారణాలను తెలుసుకోవాలని, ఏదైనా అబార్షన్ జరిగిందా అనే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలోని ఏదైనా స్కానింగ్ సెంటర్లో అబార్షన్లు లింగస్థ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఏఎన్ఎమ్లకు సూచించారు.

జిల్లాలో బాలికల శాతం గణనీయంగా తగ్గిందని,1000 మంది బాలురకు 894 మంది బాలికలు ఉన్నారని, ఈ నిష్పత్తి ఇలాగే కొనసాగితే జిల్లాకు చాలా నష్టం వాటిల్లుతుం దని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్లు తో పాటు ప్రైవేటు ఆసుప త్రుల్లో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ , డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ తారా సింగ్, భీమ్లా నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 2న గ్రామ సభలను విజయవంతం చేయాలి

జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలను సమర్థవం తంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డుల్లో సభలు విధిగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు సదుపాయాలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. వేసవి దృష్ట్యా, సభలు ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాలని మరియు ప్రజలకు సౌకర్యం కల్పించే విధంగా షామియానాలు ఏర్పాటు చేయమని డిపిఓ శ్రీరాములు ను ఆదేశించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన నివేదికను అందజేయాలని తెలిపారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్య క్రమాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 2 నుంచి వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలియజేశారు. అందువల్ల, గ్రామ, మండల మరియు నియోజ కవర్గ స్థాయిలో సభలను విజయవంతంగా అమలు చేయడం, ప్రణాళికల ప్రకారం ప్రతి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడం ముఖ్య ఉద్దేశ్యం అని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో డిపిఓ శ్రీరాములు, డిఆర్డిఎ పిడి చిన్న ఓబులేష్, డీఈఓ రమేష్ కుమార్, డిటిఓ చిన్న బాలు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ డి.ఎస్.పి శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్య సేకరణలో లక్ష్యాలను అధిగమించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి



**వికారాబాద్: వుదయం ప్రతినిధి** శనివారం కలెక్టరేటులోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణకై సంబంధిత అధికారులతో కార్యాచరణ ప్రణాళి కపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ... రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్య సేకరణకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రబీ 2025-26 వరి ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాల న్నారు. జిల్లాలోని 129 వరి ధాన్యం సేకరణ కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అధికారులు సమన్వయంతో పనిచేసి వరి ధాన్య సేకరణ సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. వివిధ ఏజెన్సీల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి ధాన్యం, పదివేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని సేకరించే దిశగా అధికారులు పనిచేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, జిల్లా అదనపు జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి, డి సి ఎం ఎస్ బిజినెస్ మేనేజర్ వెంకట రమణారెడ్డి, డిప్యూటీ డీఆర్డిఏ నరసింహులు, రవాణా కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికా రులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, వుదయం ప్రతినిధి:** పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారు లకు సూచించారు. శనివారం పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నప త్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం అదేవిధంగా మెడికల్ సిబ్బంది గురించి ఆరా తీసి అక్కడ ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సదుపాయంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారు లకు సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాధికారి రేణుకా దేవి, చీఫ్ సూపరింటెండెంట్ రాజులు ఉన్నారు.

## దివ్యాంగులకు పారదర్శకంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలి




**వనపర్తి మార్చ్ 28 (ఉదయం ప్రతినిధి)** యూడిఐడి(యూనిక్ డిజేబుల్ ఐడి) నిబంధనల ప్రకారం దివ్యాంగులకు పారదర్శ కంగా డిజేబుల్ ఐడి లను జారీ చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ సూచించారు. శనివారం సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డిఆర్డిఓ లతో యూనిక్ డిసేబుల్ ఐడీలు జారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్కు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖీమ్యా నాయక్, డి ఆర్ డి ఓ ఉమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ అధికారులకు పలు సూచనలు చేశారు. యూడిఐడి నిబంధనల ప్రకారం పారదర్శకంగా సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఎట్టి పరిస్థి తుల్లోనూ తప్పుడు సర్టిఫికెట్లు జారీ అవ్వడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అర్హులైన వికలాంగులకే కార్డులు అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే, క్యాంప్లకు వచ్చే వికలాంగులకు అవస రమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. దరఖా స్తుల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీసీ అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యూడిఐడి(యూనిక్ డిజేబుల్ ఐడి) నిబంధనల ప్రకారం దివ్యాంగులకు పారదర్శకంగా డిజేబుల్ ఐడి సర్టిఫికెట్లు జారీ చేయాలని డి ఆర్ డి ఓ కు సూచించారు. యు డి ఐ డి లకు సంబంధించి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికిన కలెక్టర్



**మహబూబ్ నగర్ మార్చి 28 (వుదయం ప్రతినిధి)** జిల్లా కేంద్రం లో జిల్లా కోర్ట్ ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం లో పాల్గొనే నిమిత్తం మహబూబ్ నగర్ కు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ లకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలు ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద పుష్ప గుచ్చం, మొక్క అంద చేసి ఘన స్వాగతం పలికారు.ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద హై కోర్ట్ న్యాయమూర్తులు పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో సంపూర్ణమైన పౌష్టికాహారం



**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి మార్చి 28** అంగన్వాడి కేంద్రంల్లో మంచి సంపూర్ణమైన పౌష్టికాహారం లభిస్తుందని సిఆర్పి సునీత అన్నారు. మండల పరిధిలోని బందారం గ్రామంలో రెండు, మూడవ అంగన్వాడి కేంద్రాలలో శనివారం ఈసీసీ డే, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలకు ప్రభుత్వం నుండి పుష్కల మైనటువంటి పోషకాహారలతో కూడిన ఆహారం లభిస్తుందని ఆమె గర్భిణీలకు బాలింతరకు సూచించారు 3 నుండి 5 సంవత్స రాల పిల్లల తల్లులు అంగన్వాడి కేంద్రాలలో అందించే పౌష్టికాహా రని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బంధారం తో పాటు కొండపాక మండల కేంద్రంలో 1,2,3,4, అంగన్వాడి కేంద్రాల్లో బాలమేల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు వారి పిల్లల యొక్క సృజనాత్మకతను బయటకు తీయ డానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతగా ఉపయోగపడుతుందని గ్రామ సర్పంచ్ మంచాల నవీన్ శ్రీనివాస్ అన్నారు రిలియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే బాలమేల కార్యక్రమాన్ని.ని ర్వహించడంతో పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీయడానికి ఎంతగానో దోహ ద ప డుతుంద ని వార న్నారు. అంగన్వాడి కేం ద్రాల లో లభిస్తు న్నటువంటి పోష కాలను ప్రతి గర్భ వతులు ,తల్లులు, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలు పిల్లలకు ఆటలతో పాటు కథలు, పాటలు, నృత్యాలు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడంతో అంగన్వాడి కేంద్రాలు ఎంతగానో బలోపేతం అవుతాయని వారు పేర్కొన్నారు ఈ కార్య క్రమంలో ఐసిడి ఎస్ సిడిపిఓ. రమాదేవి, సూపర్వైజర్ ఇందిర, సిఆర్పి సుచిత,అంగన్వాడి టీచర్లు పి రజిత, సిహెచ్ అండల్, మహాలక్ష్మి , లలిత, సరళ ,యమునా, గర్భవతులు, తల్లులు, తది తరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**నారాయణపేట మార్చి 28 (వుదయం ప్రతినిధి)** పేద ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకా లను సద్వినియోగం చేసుకో వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నా రు.శని వారం ఆయన కార్యాల యంలో నారాయ ణపేట నియోజక వర్గానికి చెందిన ప్రవీణ్ కు సి ఎం రిలీఫ్ ఫండ్ కింద 20 వేల చెక్కును అందజే శారు.నారా యణపేట పట్టణానికి చెంది న అనా రోగ్యంతో బాధపడిన వారికి వైద్య ఖర్చుల నిమి త్తం ప్రభుత్వం పరంగా చెక్కు లుఅందజేశారు.ఈ సంద ర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడు తూ ప్రతి వ్యక్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథ కాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయ వాది నందు నామాజీ మాట్లాడుతూ చెక్కు అంద జేసిన మంత్రి కిషన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాల్ యాదవ్, నవీన్ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఏడాది కిందటే జోస్యం చెప్పా.. కవిత కొత్త పార్టీ పెడతారని

### మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**సంగారెడ్డి వుదయం.** మెదక్ ఎంపీ రఘునం దన్ రావు తెలంగాణ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తారని తాను సంవత్సరం క్రితమే చెప్పానని తెలిపారు. అప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో మార్పుల సంకేతాలు కనిపించాయని ఆయన పేర్కొన్నారు. కల్వకుంట్ల కవిత భవిష్యత్ రాజకీయ దిశపై తన అంచనాలు ఇప్పుడు నిజమ వుతున్నాయని రఘునందన్ రావు అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత భారత్ రాష్ట్ర సమితి లో అంతర్గత విభేదాలు తీవ్రతరం అయ్యాయని, చివరికి పార్టీ నాలుగు ముక్కలుగా విడిపోయే పరిస్థితి వస్తుందని అప్పుడే జోస్యం చెప్పానని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్ప డుతుందని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అదే దిశగా సాగుతున్నాయని ఆయన అభిప్రాయ పడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మరియు బీఆర్ఎస్ రెండూ ఒకటేనని ఆరోపిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ప్రత్యామ్నా యంగా భారతీయ జనతా పార్టీ వైపు చూడాలని, రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

**(కంది వుదయం)** సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్కల్ గ్రామంలో శనివారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భర్త మరణాన్ని తట్టుకోలేక ఓ తల్లి తన ఇద్దరు చిన్నా రులకు విషమిచ్చి హత్య చేసి, అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన మమ త (28) భర్త జనవరిలో జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఆమె తన ఏడేళ్ల కుమారు డు మణికంఠ, ఐదేళ్ల కుమార్తె ప్రళయకు విషం ఇచ్చింది. అనంతరం ఇంట్లోనే ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డీఎస్పీ సత్తయ్య గౌడ్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లక్ష్య ఛేదనకు నిరంతర సాధన చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణపేట మార్చి 28 (వుదయం ప్రతినిధి)** విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య ఛేధన కు నిరంతర సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం ఆయన మద్దూరు మండలంలోని పెదిరి పాడ్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠ శాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలోని వంట గది, మరుగు దొడ్లు, స్టాక్ రూమ్, ఆర్వో ప్లాంట్ ను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఎనిమిదో తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థినిలతో ముచ్చటించారు. పాఠశాలలో భోజనం, ఇతర వసతి సౌకర్యాలు, చదువు గురించి విద్యార్థు లను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నా యని విద్యార్థినిలు కలెక్టర్ కు తెలిపారు. ప్రతీ వారం సినిమా చూస్తున్నారా అని ఆరా తీశారు. ఇకపై ప్రతీ శనివారం విద్యార్థినులకు పాఠశాలలో మంచి సందేశాత్మక సినిమా లను చూపించాలని ఎస్. వో కు ఆయన సూచించారు.

అనంతరం అక్కడున్న వైద్యులతో మాట్లాడి పాఠశాలలో విద్యార్థినిలు ఏ ఏ రుగ్మ తలతో బాధపడుతున్నారని, వారిలో ఏ ఏ ఆరోగ్య సమస్యలు గుర్తించారని అడిగి తెలుసు కున్నారు. ఎనీమియా సమస్యతో ఉన్న విద్యా ర్థినిలు ఎక్కువగా ఉన్నారని, అందుకు తగిన మందులను ఇస్తున్నామని,ఆహారాన్ని పెట్టిస్తు న్నామని వైద్యులు కలెక్టర్ కు తెలిపారు. మొత్తానికి పాఠశాలలో అన్ని బాగున్నాయని, పాఠశాలలో మరుగు దొడ్లు శుభ్రంగా ఉన్నాయని, ఆవరణ, వంటగది, తరగతి గదులు పరిశుభ్రంగా ఉన్నాయని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

### పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువు లను అనుమతించవద్దు

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రా నిక్ వస్తువులను అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. నారాయణ పేట మండలంలోని కోట కొండ జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పరీక్షా సరళిని పరిశీలించారు. కేంద్రాల్లో కొంత మంది విద్యార్థులు వాచ్ లు ధరించి వస్తున్నారని తెలిసిందని, పరీక్షా కేంద్రాలలోకి వాచ్ లు, ఇతర ఏ ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకు వెళ్ళేందుకు అనుమతి లేదని, సీ.ఎస్. డీ.వో లు, ఇన్విజిలేటర్ల కు సైతం కేంద్రాల్లో సెల్ ఫోన్లు తీసుకు వచ్చేందుకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు కూడా పరీక్షా కేంద్రం బయటే బందోబస్తు నిర్వ హించాలన్నారు.అనంతరం శనివారం నాటి పరీక్ష కు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యా రని ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో ఎం.ఈ.వో బాలాజీ, సీ.ఎస్.డీ.వో పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం





**మహబూబ్ నగర్ మార్చి 28 (వుదయం ప్రతినిధి)** జాతీయ లోక్ అదాలత్ అవకా శాన్ని వినియోగించుకుని ఇరుపక్షాలు,పర స్పర సమ్మతి,అంగీకారం తో తమ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి పిలుపునిచ్చారు.శనివారం మహబూబ్నగర్ జిల్లా కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా ధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి.శ్రా వణ్ కుమార్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి మాట్లాడుతూ లోక్ అదాలత్ రెండు పదాల కలయిక అని అంటే ప్రజల న్యాయస్థానం అని పిలువబడుతుందని తెలిపారు. మహబూబ్ నగర్ లో జాతీయ లోక్ అదాలత్ ను మార్చి 14 న నిర్వహించాల్సి ఉండేదని, కాని మార్చి 14,15 తేదీల్లో న్యాయ మూర్తుల సమావేశం కారణంగా రెండు వారాలు వాయిదా పడి గురువారం మార్చి 28 న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ వ్యవస్థ భారతదేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలలో అత్యంత సమర్థవంత మైనదిగా నిలుస్తోందని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న సివిల్, మోటార్ ప్రమాద క్లెయిమ్ కేసులు, బ్యాంకు రుణాలు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు వంటి అనేక కేసులను లోక్ అదాలత్ ద్వారా వేగంగా పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా పక్షాల మధ్య పరస్పర అంగీకారంతో వివాదాలను ముగించవచ్చని, దీనివల్ల శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదా లను సులభంగా పరిష్కరించుకోవాలని పిలు పునిచ్చారు.రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు వేగవంత మైన, తక్కువ ఖర్చుతో కూడిన న్యాయం అందించడమేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయం అందుబాటు లోకి తీసుకురావడంలో ఇది కీలక పాత్ర పోషి స్తుందని తెలిపారు. ముఖ్యంగా చిన్నచిన్న వివాదాలు, కుటుంబ కలహాలు, రుణ సమస్యలు వంటి అంశాలను కోర్టు వెలుపలే సర్దుబాటు చేసుకోవడం ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు.

బలహీన,అణగారిన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు న్యాయ సేవాధికార సంస్థలు .ప్రజల్లో చట్ట అవగాహన పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమ లత మాట్లాడుతూ జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా 2033 కేసులు గుర్తించినట్లు,వీటి పరి ష్కారానికి మహబూబ్ నగర్ లో 7 బెంచి లు,జడ్చర్ల లో రెండు బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం లో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్ పంచాక్షరి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంత రెడ్డి, న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రాష్ట్ర హై కోర్ట్ న్యాయమూర్తు లకు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్,జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి జాతీయ లోకా అదాలత్ కార్యక్రమం లో పాల్గొనే నిమిత్తం మహబూబ్ నగర్ కు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా ధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ లకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలు ఆర్&బి అతిథి గృహం వద్ద పుష్ప గుచ్చం, మొక్క అంద చేసి ఘన స్వాగతం పలికారు అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

## పెండింగ్ కేసులకు లోక్ అదాలత్లో పరిష్కారం

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, మార్చి 28:వు దయం.** జాతీ య మెగా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల పెండింగ్ కేసులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహిం చిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ వేదికగా పెండింగ్లో ఉన్న వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉంద న్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపర మైన వివాదాలు, వైవాహిక సమస్యలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీకి రావచ్చని వివరించారు. దీంతో కోర్టు విచారణలు, దీర్ఘకాల న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. పెండింగ్ కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర మాట్లాడుతూ, లోక్ అదాలత్లు ప్రజలకు త్వరిత, తక్కువ వ్యయంతో న్యాయం అందించే సమర్థవంతమైన వేదికలని పేర్కొ న్నారు. ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా కోర్టులపై భారం తగ్గడమే కాకుండా సామరస్య వాతావరణం నెలకొంటుందని అన్నారు. కార్య క్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మరో 5 లక్షలకు పైగా ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా



రెండు విడతల్లో 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా కోసం కొత్తగా టెండర్లు పిలిచే యోచనలో ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఉన్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాపై ప్రభావం పడటంతో విద]ుత్తు సాయంతో వంట చేసుకునే ఉపకరణాలకు గిరాకీ పెరిగింది. గిరాకీకి తగ్గట్లుగా సరఫరా పెంచేందుకు ఇటీవలే లక్ష ఇండక్షన్ స్టవ్‌లకు టెండర్ ప్రక్రియను ఈఈఎస్ఎల్ పూర్తి చేసింది. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, వినియోగదారుల అభిప్రాయాలు సేకరించి, ఇండక్షన్ ఆధారిత వంట సామగ్రికీ టెండర్ ప్రక్రియను నిర్వహించింది.




# ఆరోగ్య బీమా ప్రీమియం రూ.1.2 లక్షల కోట్లు


దేశంలో ఆరోగ్య బీమాపై అవగాహన.. అందుకనుగుణంగా పాలసీల కవరేజీ పెరుగుతోంది. 2024-25లో మొత్తం ఆరోగ్య బీమా ప్రీమియం విలువ రూ.1.2 లక్షల కోట్లను అధిగమించింది. 2023-24 ప్రీమియం కంటే ఇది 9% అధికం. ఆరోగ్య పరిరక్షణ కోసం తప్పనిసరిగా మెరుగైన చికిత్స పొందాలనే ధోరణి ప్రజల్లో పెరుగుతోంది. దీనికితోడు వైద్య ఖర్చులు అధికమవుతుండటంతో, బీమా తీసుకోవడానికి అధికులు ముందుకు వస్తున్నారని ఆర్థిక శాఖ తెలిపింది. పాలసీదారులకు సకాలంలో మద్దతు అందేలా చూసేందుకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ).. నగదు రహిత ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ కోసం, కంపెనీలకు నిర్దిష్ట కాల పరిమితులను నిర్దేశించింది. నగదు రహిత ప్రీ-ఆథరైజేషన్‌ను ఒక గంటలోగా, తుది ఆథరైజేషన్‌ను మూడు గంటల్లోగా ఆమోదించాలి. పాలసీదారుల వయసు పెరగడం, అధిక కవరేజీ, మెరుగైన సదుపాయాల వల్ల ఆరోగ్య బీమా ప్రీమియం పెరుగుతోందని వివరించింది.



ఐఆర్‌డీఏఐ 2024 నిబంధనలు.. అన్ని సంబంధిత ప్రమాద కారకాల ఆధారంగా బీమా ఉత్పత్తులకు న్యాయబద్ధంగా ధరలు నిర్ణయించాలని, అవి ఆచరణీయంగా, విలువ ఆధారితంగా కొనసాగాలని నిర్దేశిస్తున్నాయి. విశ్వసనీయ గణాంకాలు, వినియోగదారు అభిప్రాయం ఆధారంగా క్రమానుగత సమీక్షలు జరగాలని సూచిస్తున్నాయి. ఐఆర్‌డీఏఐ బీమా భరోసా పోర్టల్ ప్రకారం, 2024-25లో 1,37,361 సాధారణ, ఆరోగ్య బీమా ఫిర్యాదులు నమోదు కాగా, అందులో 1,27,755 (93%) పరిష్కారమయ్యాయి. క్లెయిమ్‌ల తిరస్కరణ లేదా నిరాకరణకు గల కారణాలు చాలా వరకు నిర్దిష్ట పాలసీ షరతులు, పరిమితులేనని పేర్కొంది. బీమా మొత్తాన్ని క్లెయిమ్ మించడం, కో-పేమెంట్ నిబంధన, పాలసీలలో ఉప పరిమితులు, టాప్-అప్ పాలసీల్లో మినహాయింపు, గది అద్దెపై పరిమితి, దామాషా ఛార్జీలు, వైద్యేతర ఖర్చుల వంటివి ఉన్నాయి. స్పష్టతను పెంచడానికి, క్లెయిమ్‌ల ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, పాలసీదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి ఐఆర్‌డీఏఐ అనేక చర్యలు తీసుకుందని ఆర్థిక శాఖ తెలిపింది.

# రిఫండ్లకు ఇబ్బందేమీ లేదు

వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) నుంచి నూతన ఆదాయపు పన్ను చట్టం-2025 అమల్లోకి రానున్న నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఊరటనిచ్చింది. పాత చట్టం కింద పన్ను రిటర్నులు దాఖలు చేసి, రిఫండు కోసం ఎదురుచూస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందీ లేదని పేర్కొంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భారతదేశంలో 65 ఏళ్లనాటి ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త ఆదాయ పన్ను చట్టం-2025 అమలుకు రంగం సిద్ధమైంది. ఈ మార్పు నేపథ్యంలో తమ పాత రిఫండ్లు ఏమవుతాయో అని ఆందోళన చెందుతున్న వారి సందేహాలను నివృత్తి చేస్తూ, పన్నుల బోర్డు ఒక సమగ్ర ప్రకటన విడుదల చేసింది. పాత ఆదాయపు పన్ను చట్టం నుంచి నూతన ఆదాయపు పన్ను చట్టానికి మారడం వల్ల పన్ను చెల్లింపుదారులు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలను కోల్పోరని ఆదాయపు పన్ను శాఖ స్పష్టం చేసింది. తరచూగా అడిగే ప్రశ్నల పత్రం ప్రకారం నూతన చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా పాత చట్టం కింద ఏర్పడిన హక్కులు, ప్రయోజనాలు చట్టపరంగా రక్షణ పొందుతాయి.



బాధ్యతలూ కొనసాగుతాయని తెలిపింది. 'ఒక పన్ను చెల్లింపుదారుడు కొత్త పన్ను చట్టం ప్రారంభానికి ముందు ఏదైనా పన్ను సంవత్సరానికి సంబంధించి రిఫండు పొందేందుకు అర్హులైతే, ఏప్రిల్ 1, 2026 తర్వాతా దానికి అర్హులే'నని పేర్కొంది.

# ట్యాబ్లెట్ పీసీల్లో శామ్‌సంగ్ జోరు


దేశంలో ట్యాబ్లెట్ పీసీ మార్కెట్, గతేడాది వార్షిక ప్రాతిపదికన 2% వృద్ధి చెందింది. ఈ విభాగంలో శామ్‌సంగ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, యాపిల్, ఏసర్ సరఫరాలు తగాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. భారత ట్యాబ్లెట్ మార్కెట్, ప్రీమియం ఉత్పత్తుల వైపు మళ్లుతోందని, అధిక పనితీరు కలిగిన వాటికి వినియోగదారులు మొగ్గుచూపుతున్నారని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ అనలిస్ట్ అన్షికా జైన్ తెలిపారు.



రూ.30,000-40,000 ధర కలిగిన ట్యాబ్లెట్ల విభాగం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని, ఈ విభాగం సరఫరాలు దాదాపు 7 రెట్లు పెరిగినట్లు వెల్లడించారు. భారత్‌లో శామ్‌సంగ్ ట్యాబ్లెట్ పీసీ సరఫరాలు 15% పెరిగాయి. శామ్‌సంగ్ మార్కెట్ వాటా 2024లో 27% కాగా, 2025లో 31 శాతానికి పెరిగింది. గెలాక్సీ ట్యాబ్ ఏ9, ఏ11 సిరీస్‌లు ఈ వృద్ధికి దోహదపడ్డాయి. గెలాక్సీ ట్యాబ్ ఎస్ పోర్ట్‌ఫోలియోతో రూ.15,000-30,000 విభాగంలో కంపెనీ ఆధిపత్యం చెలాయించింది. 20% మార్కెట్ వాటాతో యాపిల్ రెండో స్థానంలో నిలిచింది. కంపెనీ సరఫరాలు గతేడాది 2% తగ్గాయి. లెనోవో 15% వాటాతో 24% వృద్ధిని, షియామీ 11% వాటాతో 74% వృద్ధి సాధించాయి. ఏసర్ మార్కెట్ వాటా 21% నుంచి 10 శాతానికి పడిపోయింది. 10 లక్షల ఎగుమతులు: భారత ట్యాబ్లెట్ల తయారీ రంగానికి 2025 ఒక మలుపుగా నిలిచింది. గతంతో నామమాత్రంగా ఉన్న ఎగుమతులు, 2025లో 10 లక్షల యూనిట్లను మించాయి. ఎగుమతుల్లో శామ్‌సంగ్, లెనోవో అగ్రస్థానాల్లో ఉన్నాయి. మన దేశం నుంచి అమెరికా, ఐరోపా మార్కెట్లకు ఎక్కువ ఎగుమతులు వెళ్లాయి. వార్షిక సరఫరాల్లో 50% దేశీయంగానే ఉత్పత్తి అయ్యాయి. ఇది దేశీయ తయారీ సామర్థ్యాలు పెరగడానికి నిదర్శనం అని నివేదిక వెల్లడించింది. 2026లో కూడా భారత ట్యాబ్లెట్ విపణి బలమైన వృద్ధిని కొనసాగించే అవకాశం ఉందని కౌంటర్‌పాయింట్ అంచనా వేస్తోంది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఫీచర్లు ఉన్న ట్యాబ్లెట్లు వినియోగదారులను ఆకట్టుకుంటాయని, భారత్ ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా మరింత బలోపేతం కానుందని నివేదిక పేర్కొంది.

# నిపుణుల కంటే ఏఐతో పని చౌక

నిపుణులతో పోలిస్తే, కృత్రిమ మేధ(ఏఐ)తో మేధోపరమైన పనులు చౌకగా నిర్వహించుకునేలా అడుగులు పడుతున్నాయని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. 'ఇన్‌ఫరెన్స్' దశలో ఉన్న ఏఐ మోడళ్లను పనిచేయించే విషయంలో.. నిపుణుల వ్యయాల కంటే తక్కువ ఖర్చుతో, వారికి సమానమైన మేధోశక్తితో ఏఐ చేయగలుగుతోందని ఫోర్బ్స్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో బోధనా పద్ధతులు మారకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్‌పై అధికంగా ఆధారపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఏఐకయ్యే శిక్షణ ఖర్చులు, మనుషుల సామర్థ్యం మధ్య పోలికల విషయానికొస్తే.. మానవ మేధకు దశాబ్దాల పాటు బయోలాజికల్ 'శిక్షణ', జీవితకాలం పాటు శక్తి వినియోగం అవసరం. మేధో ఫలితాలను ఒక్కో యూనిట్ ఆధారంగా చూస్తే.. ఏఐ వ్యవస్థలు మెరుగ్గా మారుతున్నాయి. సామర్థ్యం మరింత పెరిగే అవకాశాలూ కనిపిస్తున్నాయి. ఒక్కో పని చొప్పున చూసినా ఏఐ చౌకగానే ఉంటోంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవు. నిపుణులు చేసే పని మారుతుంది. ఉద్యోగాలపై ఏఐ చూపే ప్రభావంలో ఏకరూపత ఉండకపవచ్చు. కొన్ని ఉద్యోగాల్లో పాక్షిక ఆటోమేషన్ కనిపించొచ్చు. మరి కొన్ని పూర్తిగా మారిపోవచ్చు. సరికొత్త ఉద్యోగాలూ రావచ్చు. యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లు ఇటీవలి వరకూ లేరు.. ఇపుడు ఎక్కువ మంది యువత ఆ బాట పడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. ఉద్యోగం విషయంలో సవాళ్లను ఎదుర్కోవాలంటే, ఇప్పటి నుంచి దశాబ్దం తర్వాత ఎటువంటి నైపుణ్యాలు అవసరమో అంచనా వేయడం ముఖ్యం. ఒకప్పుడు కోడింగ్ అందరికీ అవసరమైన నైపుణ్యం. ఇపుడు ఏఐ టూల్స్‌ను అందిపుచ్చుకోవడం కీలకంగా మారింది. మనకు ఇపుడు నైపుణ్యం అడ్డంకిగా లేదు. వనరులే ముఖ్యం. అందుకే దేశాలు ఏఐ మౌలిక వసతులను



స్థానికంగా అభివృద్ధి చేసుకోవాలా, లేదా బయటి ప్రొవైడర్లపై ఆధారపడాలా అన్నది నిర్ణయించుకోవాలి. సాంకేతికతలో మార్పులు రావడం అసలైన సవాలు కాదు. విద్యా వ్యవస్థలు వాటిని అందుపుచ్చుకోవడమే సిసలు సవాలు. బోధనాపద్ధతుల్లో మార్పురాకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్ పైనే అధికంగా ఆధారపడే అవకాశం ఉంది. ఏఐ టూల్స్ అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకుని, అభ్యాస వ్యవస్థలను విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమస్య-పరిష్కారాలతో రీడిజైన్ చేయాలి. ఏఐని అందిపుచ్చుకునే విషయంలో భారత్ అత్యంత క్రియాశీలక మార్కెట్‌గా ఉంది. మౌలిక వసతుల నుంచి అప్లికేషన్ల వరకు.. ఇలా పూర్తి స్టాక్‌పై పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ కోడింగ్ ప్రోడక్ట్‌కు భారత్ అత్యంతవేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌గా ఉంది. త్వరలో అతిపెద్ద మార్కెట్‌గానూ మారొచ్చు. సంప్రదాయఇంటర్నెట్ సేవలతో పోలిస్తే ఏఐ సేవలను అందించడం చాలా ఖరీదైన వ్యవహారం. అందుకే కంపెనీలు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవడం ముఖ్యం. భారత్ వంటి మార్కెట్లను అవి కనుగొనాలి. ఏఐ ఆధారిత వ్యక్తిగత ఏజెంట్లను మరింతగా అందిపుచ్చుకోవడానికి భద్రత, గోప్యత.. అతిపెద్ద సమస్యలుగా ఉన్నాయి. సునిశిత వ్యక్తిగత సమాచారం విషయంలో ప్రస్తుత వ్యవస్థలు అంత నమ్మదగినవి కావు. అందువల్ల వాటికి సమాచారం ఇచ్చే ముందు జాగ్రత్తగా ఉండాలి.




## బ్యాడ్మింటన్‌కు మారిన్ వీడ్కోలు



స్పెయిన్ బ్యాడ్మింటన్ దిగ్గజం కరోలినా మారిన్ ఆటకు వీడ్కోలు పలికింది. చాలా కాలంగా మోకాలి గాయంతో బాధపడుతున్న మారిన్ గురువారం రిటైర్‌మెంట్ ప్రకటించింది. ''ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్‌లో నా ప్రయాణం ముగిసింది.హెలువాలో జరిగే ఐరోపా ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగట్లేదు. చివరగా నా తోటి షట్లర్లతో పోటీపడాలని అనుకున్నా. కానీ గాయం కారణంగా ఆ సాహసం చేయదలుచుకోలేదు'' అని 32 ఏళ్ల మారిన్ సామాజిక మాధ్యమంలో పేర్కొంది. 2016 రియో ఒలింపిక్స్, 2018 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ పి.వి.సింధును ఓడించి మారిన్ విజేతగా నిలిచింది. దూకుడైన ఆటకు మారుపేరైన ఈ ఎడమచేతి వాటం షట్లర్.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో (2014, 2015, 2018)లో మూడు స్వర్ణాలు, ఒక రజతం (2023) గెలిచింది. ముఖ్యంగా సింధుతో మారిన్ పోరాటాలను అభిమానులు అంత తేలిగ్గా మరిచిపోలేరు. గాయాలతో బాధపడుతూనే కెరీర్‌ను కొనసాగించిన మారిన్.. ఆఖరిగా 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడినా.. పతకం సాధించలేకపోయింది.

# అలా అయితే.. ధోని రిటైర్ అయిపోవాలి: రవిచంద్రన్ అశ్విన్

ఐపీఎల్ (IPL) ప్రారంభానికి ముందు ఎంఎస్ ధోనిపై (MS Dhoni) రవిచంద్రన్ అశ్విన్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. అతడిని చెన్నై సూపర్‌కింగ్స్ ఇంపాక్ట్‌ప్లేయర్‌గా ఆడించొద్దని సూచించాడు. అతడు జట్టులో ప్లేయింగ్ ఎలెవన్‌లో కచ్చితంగా ఉండాలన్నాడు. 'ధోని ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగడాన్ని నేను ఒప్పుకోను. అతడు ఒకవేళ చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో ఉంటే... అని అశ్విన్ పేర్కొన్నాడు. 'దిక్సూచిలా పని చేస్తాడు' 'అతడు మీ ఆరో నంబర్ బ్యాటర్ కాదనే విషయాన్ని నేను అంగీకరిస్తున్నా. అతడు రెండు పాత్రలు పోషించగలడు. మైదానంలో ధోని.. రుతురాజ్ గైక్వాడ్‌కు దిక్సూచిలా పనిచేస్తాడు. కొత్త బౌలింగ్ లైనప్‌నకు సహాయ సహకారాలు అందిస్తాడు. గత సంవత్సరం అతడు చివరి మూడు ఓవర్లు ఆడాలని చూశాడు. కానీ ప్రతిసారీ



కచ్చితంగా ఆడాల్సిందే. ఆడొద్దు అనుకుంటే సీజన్ మొత్తం ఆడొద్దు. అంతేకానీ అతడు ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రం బరిలోకి దిగొద్దు' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించాడు. 'మీరు చెన్నై సూపర్‌కింగ్స్ ప్లేయింగ్ ఎలెవన్‌ను తయారుచేస్తుంటే.. అందులో ఎంఎస్ ధోనికి కచ్చితంగా స్థానం కల్పించాలి. ఒకవేళ అతడు ఆడొద్దు అనుకుంటే.. రిటైర్ అవ్వాలి. అయితే.. తాను ఆడగలననే నమ్మకం అతడిలో 100 శాతం ఉంది. ధోని మూడు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దీనిద్వారా అతడు తాను ఆడగలననే సందేశాన్ని ఇస్తున్నాడు. ఒకవేళ అతడు ఆడాలనుకుంటే.. నువ్వు ఆడటం కుదరదు.. అని అతడితో చెప్పడం మీకు సాధ్యం కాదు' టాప్ ఆర్డర్ పరుగులు రాబట్టలేదు. అతడు కాస్త ముందే బ్యాటింగ్‌కు వచ్చి ఉండాల్సింది. అయితే ఈసారి మాత్రం ఆ పరిస్థితి లేదు. వారు టాప్ ఆర్డర్‌ను పటిష్ఠం చేసుకున్నారు' అని అశ్విన్ అన్నాడు. 'ఈ సీజన్‌లోనూ ధోని ఒకటి, రెండు మ్యాచుల్లో మాత్రమే కాస్త ముందు బ్యాటింగ్‌కు వస్తాడేమో. దాదాపు అన్ని మ్యాచుల్లోనూ చివర్లోనే బ్యాటింగ్‌కు వచ్చే అవకాశముంది. కీపింగ్‌పై అతడు ప్రధానంగా దృష్టి సారిస్తాడు. ఫీల్డ్ సెట్టింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు మార్గనిర్దేశనం చేస్తాడు. మొత్తానికి ధోని పెద్దన్న పాత్ర పోషిస్తాడు' అని రవిచంద్రన్ అశ్విన్ వెల్లడించాడు.

## స్వర్ణ పోరుకు చికిత ద్వయం

ఆసియాకప్ ప్రపంచ ర్యాంకింగ్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్లో తెలంగాణ అమ్మాయి చికిత తానిపర్తి జోరు కొనసాగుతోంది. ఫైనల్ చేరిన కాంపౌండ్ మహిళల జట్టులో సభ్యురాలైన తెలుగమ్మాయి.. మిక్స్‌డ్ విభాగంలో రజత్ చౌహాన్ భాగస్వామిగా స్వర్ణ పోరుకు




అర్హత సాధించింది. గురువారం సెమీఫైనల్లో చికిత-రజత్ జంట 157-153తో విక్టోరియా లిన్-బన్‌యాడ్ మిర్జామెటోవ్ (కజకిస్థాన్) జోడీని ఓడించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్‌లో రుమా బిస్వాస్-దేవాంగ్ గుప్తా జంటకు చుక్కెదురైంది. క్వార్టర్స్‌లో రుమా జంట 2-6తో థియ్ డావో-హౌయాంగ్ గుయెన్ (వియత్నాం) ద్వయం చేతిలో ఓడింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్, ఉదయ్ కాంబోజ్ ఫైనల్ చేరడంతో స్వర్ణం, రజతం భారత్‌కే ఖరారయ్యాయి. ప్రథమేశ్ 149-148తో సహచరుడు రజత్ చౌహాన్‌పై నెగ్గగా.. ఉదయ్ 147-145తో పిరావత్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు. రజత్ కాంస్యం కోసం పోరాడనున్నాడు. మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో రిధి ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీస్‌లో జింగ్ లీ (మలేసియా)పై రిధి 6-0తో విజయం సాధించింది. మొత్తంగా ఈ టోర్నీలో మహిళల రికర్వ్ వ్యక్తిగత, పురుషుల రికర్వ్ టీమ్, మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్, పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగాల్లో భారత్ ఫైనల్ చేరింది. భారత్ ఇప్పటికే కాంపౌండ్ పురుషులు, మహిళల టీమ్ విభాగాల్లో కాంస్యాలు గెలిచింది.


## ముంబయి తిరిగి ఆ పొరపాటు చేయదనుకుంటున్నా: మహ్మద్ కైఫ్




ఐపీఎల్ (IPL) ప్రారంభానికి ముందు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ముంబయి ఇండియన్స్‌కు కీలక సూచనలు చేశాడు. ప్రస్తుతం ముంబయికి హార్దిక్ పాండ్య కెప్టెన్‌గా ఉన్నాడు. టీ20 వరల్డ్ కప్ 2026లో టీమ్‌ఇండియాను విజేతగా నిలిపిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రస్తుతం ముంబయి టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ యాదవ్‌కు ముంబయి కెప్టెన్సీ అప్పజెప్పాలని ఇటీవల భారత జట్టు మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అభిప్రాయం వ్యక్తం చేశాడు. దీనికి భిన్నంగా మహ్మద్ కైఫ్ స్పందించాడు. అలా చేయడం పొరపాటే అవుతుందన్నాడు. కెప్టెన్సీ మార్పు విషయంలో ముంబయి ఇండియన్స్ మరోసారి తప్పు చేయదనుకుంటున్నా. వారు రోహిత్ శర్మ నుంచి కెప్టెన్సీని హార్దిక్‌కు అప్పగించిన తర్వాత జట్టు ప్రదర్శన పడిపోయింది. హార్దిక్ పాండ్య ఇప్పుడు కుదురుకుంటున్నాడు. సూర్యకుమార్ యాదవ్ కూడా కెప్టెన్సీ ఆప్షన్. కానీ రోహిత్ శర్మ విషయంలో జరిగినట్లుగా మళ్లీ హార్దిక్ పాండ్యకు జరగొద్దు' అని కైఫ్ అన్నాడు. జోష్ హేజిల్‌వుడ్ ఆర్సీబీ శిబిరంలో చేరాడు. అతడి రాకతో ఆర్సీబీ బౌలింగ్ విభాగం బలంగా మారింది. అయితే అతడు వెంటనే బరిలోకి దిగే అవకాశాలు లేవు.గాయాల నుంచి కోలుకుంటున్న అతడు కొన్ని మ్యాచ్‌ల అనంతరం మైదానంలో కనిపించే ఛాన్స్ ఉంది. గత సీజన్‌లో ఆర్సీబీని ఐపీఎల్ విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. 12 మ్యాచుల్లో 22 వికెట్లు తన ఖాతాలో వేసుకొని, సత్తా చాటాడు. ఆర్సీబీ జట్టు నువాన్ తుషార లేకుండానే బరిలోకి దిగనుంది. అతడికి శ్రీలంక క్రికెట్ బోర్డ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) రాకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఆటగాళ్లకు మ్యాచ్ ఫిట్‌నెస్ లేనప్పుడు శ్రీలంక క్రికెట్ బోర్డ్ ఎన్ఓసీ జారీ చేయదని సమాచారం. తుషార గాయానికి గురికాలేదు.. అయినప్పటికీ అతడు మ్యాచ్‌లు ఆడేంత ఫిట్‌గా లేడని వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్ 2026లో పాల్గొనాలనుకునే తమ కాంట్రాక్టు ఆటగాళ్లంతా కచ్చితంగా ఫిజికల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాలని శ్రీలంక క్రికెట్ బోర్డ్ గతవారం స్పష్టం చేసింది. అయితే.. శ్రీలంక తీసుకుంటున్న ఇలాంటి కఠిన చర్యలను శ్రీలంక మాజీ క్రికెటర్ చమింద వాస్ ఖండించాడు. 'క్రికెట్ విషయానికి వస్తే ఫిట్‌నెస్ చాలా ముఖ్యం. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ మీరు దాన్ని సంవత్సరాల తరబడి నిర్లక్ష్యం చేసి, ఆపై ఐపీఎల్‌కు ముందు అకస్మాత్తుగా కఠినమైన ప్రమాణాలను అమలు చేయలేరు.' అని చమింద వాస్ విమర్శించాడు.

## 'ఇంపాక్ట్'కు నేను వ్యతిరేకం: గిల్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనకు వ్యతిరేకత పెరుగుతోంది. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్‌ల తర్వాత గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై అభ్యంతరం తెలిపాడు. అది ఆటగాళ్ల నైపుణ్యాన్ని దెబ్బ తీస్తుందని చెప్పాడు. ముంబయిలో ఐపీఎల్ జట్ల కెప్టెన్ల సమావేశంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. ''ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను నేను వ్యతిరేకిస్తున్నా. క్రికెట్ 11 మంది




ఆట. కానీ ఒక ప్లేయర్ అధికంగా జట్టులో చేరడం.. ఆటగాళ్ల నైపుణ్యాన్ని దెబ్బ తీస్తుంది'' అన్నాడు.
అయితే ఈ నిబంధన 2027 వరకు కొనసాగనుంది. గుజరాత్ టైటాన్స్ గురించి మాట్లాడుతూ.. ''గత మూడు, నాలుగు సీజన్లలో నేను బాగానే పరుగులు చేశా. కాబట్టి ప్రత్యేకంగా నిరూపించుకోవాల్సిన అవసరం లేదని భావిస్తున్నా. మొదటి నుంచి మేము జట్టుగా స్థిరంగా రాణిస్తున్నాం. ఈ సారి కూడా అదే కొనసాగిస్తే మరో ట్రోఫీ గెలుస్తాం'' అని పేర్కొన్నాడు. 2022లో ఐపీఎల్‌లో ప్రయాణం ప్రారంభించిన గుజరాత్.. హార్దిక్ పాండ్య సారథ్యంలో తొలి ఏడాదే ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.




## బరి పూజా కార్యక్రమం



ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద నిహారిక కొణిదెల నిర్మిస్తున్న నూతన చిత్రం 'బరి' పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద నిహారిక కొణిదెల నిర్మాతగా యదు వంశీ తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'బరి'. ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలను శనివారం నాడు నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టగా మైత్రీ మూవీస్ నిర్మాత నవీన్ యెర్నేని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు మేర్లపాక గాంధీ, నిర్మాత రాజీవ్ రెడ్డి ఎదుగురు స్క్రిప్ట్ అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం యూనిట్ చిత్రానికి సంబంధించిన విశేషాల్ని పంచుకున్నారు.

## యూత్ మూవీ బ్లాక్ బస్టర్ థ్యాంక్ మీట్




కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ మూవీ "యూత్". తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఈ 2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా "యూత్" మూవీకి తెలుగు ప్రేక్షకుల ఘన విజయాన్ని అందించారు. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను చార్మింగ్ స్టార్ శర్వానంద్ అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు.

## పెద్ది పహిల్వాన్
### నెం.1 ట్రెండింగ్‌లో గ్లింప్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' కోసం చేసిన ఫియర్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ స్పెషల్ గ్లింప్స్‌తో పాటు వచ్చిన పోస్టర్లు ఆయనను పూర్తిగా కొత్త అవతార్‌లో చూపించాయి. పహిల్వాన్ లుక్‌లో ఆయన కనిపించిన తీరు ప్రేక్షకులని సర్ప్రైజ్ చేసింది. 'పెద్ది పహిల్వాన్' గ్లింప్స్ విడుదలైన వెంటనే ట్రెమండస్ రెస్పాన్స్ తో దేశవ్యాప్తంగా నెం.1 ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది.

ఈ సినిమాలో చరణ్ బాడీ లాంగ్వేజ్, ఫిజిక్ పూర్తిగా రా అండ్ ఫెరోషియస్‌గా కనిపిస్తోంది. నిజమైన ఫైటర్‌లా కనిపించే బలమైన భుజాలు, చేతులు, భారీ ఛాతీ, కండలు తిరిగిన దేహంతో అసలైన పహేల్వాన్‌గా కనిపించారు. రెజ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే విజువల్స్ ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను మరింత పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. ముందుకు దూసుకెళ్లే సీన్స్‌లో, గదను పట్టుకుని కూర్చునే షాట్స్‌లో, హనుమాన్ ప్రేరణతో వచ్చిన యోధుడిలా ఆయన ఆగ్రహం, ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపిస్తున్నాయి. దుమ్ము ఎగిరే ఫ్రేమ్స్, నరాలు బిగుసుకునే ఎఫర్ట్, కళ్లలో కనిపించే ఫైర్ అన్నీ కలిపి ఒక థండరస్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తున్నాయి.

ఇది కేవలం ఒక మేకోవర్ కాదు.. బలం, క్రమశిక్షణ, మైథిక్ పవర్ కి ప్రతీకలా నిలిచే పాత్ర. ఈ గ్లింప్స్‌తో పెద్ది సినిమా స్కేల్, మాస్ ఇంపాక్ట్, హై వోల్టేజ్ ఎలివేషన్ ఎంత భారీగా ఉండబోతుందో స్పష్టమవుతోంది.

దర్శకుడు బుచ్చి బాబు సనా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తుండగా, ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా, మైత్రి మూవీ మేకర్స్ ప్రెజెంటేషన్‌లో, సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో భారీ కాన్వాస్‌పై రూపొందుతోంది.

## నిధుల సేకరణలో టీచ్ ఫర్ ఛేంజ్
### హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహణ
### ప్రభుత్వ పాఠశాలల పిల్లల విద్యకు మద్దతు



ప్రీమియర్ ఎనర్జీస్ సమర్పణలో, నటి మరియు సామాజిక సేవకురాలు లక్ష్మీ మంచు ఆధ్వర్యంలో నిర్వహించిన టీచ్ ఫర్ ఛేంజ్ వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం 2026, హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం, కార్పొరేట్, విద్యా రంగం, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై, ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పిల్లల నాణ్యమైన విద్యకు మద్దతు తెలిపారు. ఈ వార్షిక కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మరియు వెనుకబడిన వర్గాల పిల్లల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను ప్రస్తావించింది. ప్రతి చిన్నారికి వారి సామాజికఆర్థిక పరిస్థితులు ఏవైనా సరే, నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం, కార్పొరేట్లు, స్వచ్ఛంద సంస్థలు మరియు వ్యక్తుల మధ్య భాగస్వామ్యం అవసరమని ఈ వేదిక నొక్కి చెప్పింది. ఈ వేడుకలో భాగంగా భారత సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు విద్యా సేవకు మద్దతుగా ర్యాంప్ వాక్ చేశారు. ప్రముఖ డిజైనర్ రామ్‌జ్ రూపొందించిన ప్రత్యేక కలెక్షన్స్‌తో పాటు సాఖీ హెరిటేజ్ దుస్తులు మరియు రోజ్ జ్యువెలరీ ఆభరణాలు ప్రదర్శించబడ్డాయి. ఈ ఫ్యాషన్ ప్రదర్శన సినిమా, ఫ్యాషన్ మరియు సేవ భావనల సమ్మేళనంగా నిలిచింది.



## టీఎఫ్ జేఏ డైరీ లాంచ్



తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతి సంవత్సరం తెలుగు సంవత్సరాది సందర్భంగా జర్నలిస్టుల కోసం డైరీ విడుదల చేయడం, ఇన్సూరెన్స్ ప్లాన్‌ను రెన్యువల్ చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. 2026-2027 సంవత్సరానికి సంబంధించిన డైరీ మరియు ఇన్సూరెన్స్ రెన్యువల్‌ను మెగాస్టార్ చిరంజీవి గారి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.

ఈ ఏడాది ప్రత్యేకంగా, ప్రతి ఫిల్మ్ జర్నలిస్ట్ కుటుంబానికి (2+2) అందించే ఇన్సూరెన్స్ కవరేజీని ₹5 లక్షల నుంచి ₹10 లక్షలకు పెంచడం జరిగింది.

అదేవిధంగా, ప్రమాదాల సమయంలో జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక యాక్సిడెంట్ పాలసీ ప్రవేశపెట్టారు.

ఏదైనా ప్రమాదం కారణంగా 2 నుంచి 12 నెలలు బెడ్ రెస్ట్ అవసరమైన పరిస్థితుల్లో, ప్రతి వారం ₹10,000 చొప్పున సహాయం అందేలా ఈ పాలసీ రూపొందించబడింది.

తెలుగు ఫిల్మ్ జర్నలిస్టులకు గుర్తింపు కల్పించే విధంగా అసోసియేషన్ తరఫున ఐడి కార్డులు జారీ చేయగా, వాటిని కూడా చిరంజీవి గారు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి గారు టీఎఫ్ జేఏ చేపడుతున్న కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందిస్తూ ₹5 లక్షల చెక్కును అందించి, సభ్యుల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టీఎఫ్ జేఏ ప్రెసిడెంట్ వై.జె. రాంబాబు, ప్రధాన కార్యదర్శి ప్రసాదం రఘు, ట్రెజరర్ నాయుడు సురేంద్ర, పొలిటి బ్యూరో కన్వీనర్ వారణాసి లక్ష్మీనారాయణతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ మరియు పోలిట్ బ్యూరో సభ్యులు పాల్గొన్నారు.

## బైకర్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే సినిమా

చార్మింగ్ స్టార్ శర్వా, అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హైఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్ట మొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ డాల్బీ సినిమా, ఈపీఐక్యూ, 4డిఎక్స్, పిసిఎక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది. ఇప్పటికే గ్లింప్స్‌లు, పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.



**బైకర్ ఆడియన్స్‌కు ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది?**

బైకర్ 100% థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. డాల్బీ విజన్‌లో కూడా షూట్ చేశాం. ట్రైలర్ చూసిన ప్రతి ఒక్కరూ ఈ సినిమా సౌండ్ డిజైన్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఖచ్చితంగా ఈ సినిమా థియేటర్‌లో చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఉంటుంది.

**ఈ కథ రాయడానికి ఇన్స్పిరేషన్?**

బైక్ అనేది అందరికీ ఒక ఎమోషన్. నాకు పర్సనల్‌గా ఆ ఎమోషన్ అంటే చాలా ఇష్టం. ఇందులో రేసింగ్‌తో పాటు చాలా మంచి ఫ్యామిలీ ఎమోషన్ ఉంది. ఫాదర్‌సన్ మధ్య ఉండే ఎమోషన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది.

**షూటింగ్‌లో మీరు ఎదుర్కొన్న చాలెంజెస్ ఏమిటి?**

ఈ సినిమాలో రేసింగ్ సీక్వెన్స్‌లను రియల్ రేసర్స్‌తో షూట్ చేశాం. షూట్ చేసినప్పుడు చాలా యాక్సిడెంట్లు జరిగాయి. ఒక షాట్ చేసిన తర్వాత రెండు గంటలు బ్రేక్ ఇవ్వాల్సి వచ్చేది. కేవలం యాక్షన్‌కే 60 రోజులకు పైగా పట్టింది. ఈ సినిమా రెండు టైమ్‌లైన్స్‌లో జరుగుతుంది. 90స్‌లో టూ స్ట్రోక్ బైక్స్ ఉండేవి, అవి ఇప్పుడు లేవు. వాటిని డిజైన్ చేయడానికి చాలా టైం పట్టింది. ఇందులో రేసింగ్ ఇండోనేషియాలో షూట్ చేశాం. ఆ బైక్స్ అన్నీ మళ్లీ ఇండియాకు తీసుకురావడం కూడా చాలా పెద్ద ప్రాసెస్. అలాగే ఈ సినిమా కోసం న్యూజీలాండ్, ఆస్ట్రేలియా నుంచి రేసర్స్ ని రప్పించాము.

**ఇండియాలో ఈ స్పోర్ట్స్ ఉందా?**

ఉంది. కానీ రావాల్సిన పాపులారిటీ రాలేదు. ఇందులో రాజశేఖర్ గారి క్యారెక్టర్‌తో ఇదే అంశాన్ని ప్రెజెంట్ చేస్తున్నాం. ఇండియాలో శ్యామ్ కొఠారి అనే వెటరన్ రేసర్ ఉన్నారు. కానీ ఆయనకి క్రికెట్‌లో కపిల్ దేవ్‌కి వచ్చినంత గుర్తింపు రేసింగ్‌లో రాలేదు. ఈ రేసింగ్ స్పోర్ట్ మనకి ఎప్పటినుంచో ఉంది, కాకపోతే ఇందులో కొంచెం రిస్క్ ఎక్కువ. కపిల్ దేవ్‌కి ఉన్నంత గుర్తింపు శ్యామ్ కొఠారికి కూడా రావాలనేదే నా మోటివ్. ఇది ఫిక్షనల్ స్టోరీ అయినప్పటికీ రేసింగ్ విషయంలో కొన్ని ట్రూ ఇన్సిడెంట్స్‌ను ఇన్స్పిరేషన్‌గా తీసుకున్నాం. రాజశేఖర్ గారు కోచ్ అలాగే ఫాదర్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ఆయన క్యారెక్టర్ రెగ్యులర్ ఫాదర్‌లా ఉండదు. ఆయన చుట్టూ ఒక కథ తిరుగుతుంది. ఆయన ఆ క్యారెక్టర్ చేయడంతో ఎమోషన్ ఇంకా స్ట్రాంగ్ అయ్యింది.

**ఈ సినిమా ఎలాంటి కొత్తదనం ఇస్తుంది?**

ఎఫ్ వన్ సినిమా రిలీజ్ అయినప్పటికీ నా సినిమా పూర్తి అయిపోయి పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. ఎమోషన్, డ్రామా పరంగా రెండు కూడా చాలా డిఫరెంట్ సినిమాలు.

## మహాకాళి తన పోర్షన్ షూటింగ్ పూర్తి చేసుకున్న అక్షయ్ ఖన్నా



అక్షయ్ ఖన్నా పుట్టినరోజు సందర్భంగా, దర్శకుడు ప్రశాంత్ వర్మ 'మహాకాళి' సెట్స్ నుంచి ఒక కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (PVCU)లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చాప్టర్ గురించి ఒక ఎక్సయిటింగ్ అప్‌డేట్‌ను ఇచ్చారు. ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి, ప్రశాంత్ వర్మ షోరన్నర్‌గా వ్యవహరిస్తుండగా, పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం భారతీయ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పౌరాణిక చిత్రాలలో ఒకటిగా నిలుస్తోంది చిత్ర బృందం 100 రోజుల షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేయగా, చివరి 40 రోజుల షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శుక్రాచార్యుడి కీలక పాత్ర కోసం అక్షయ్ ఖన్నా తన చిత్రీకరణను పూర్తి చేశారు. నిర్మాతలు త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. మల్టీ స్టూడియోల వీఎఫ్ఎక్స్ పనులు శర వేగంతో సాగుతున్నాయి. ఈ చిత్రంలో భూమి శెట్టి టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. ఆమె ఉగ్రరూపంలో కనిపించిన ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా టాలీవుడ్ అరంగేట్రం భారీ అంచనాలను రేకెత్తించగా, అతని ఫస్ట్ లుక్‌కు కూడా సోషల్ మీడియాలో అద్భుతమైన ప్రశంసలు లభించాయి. ఇప్పుడు అతను తన భాగానికి సంబంధించిన చిత్రీకరణను పూర్తి చేయడంతో, అతని పాత్రపైనా, పీవీసీయూపైనా అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం, సురేష్ రగుతు సినిమాటోగ్రఫీ, శ్రీనాగేంద్ర తంగలా ప్రొడక్షన్ డిజైనర్. 'మహాకాళి' విజువల్ వండర్ గా రూపుదిద్దుకుంటోంది.

## నేను చాలా బిజీ



చిన్న సినిమాగా విడుదలై, గత సంవత్సరం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న చిత్రాల్లో 'రాజు వెడ్స్ రాంబాయి' ఒకటి. ఇందులో తేజస్వి రావు హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ఈ ముద్దుగుమ్మ తన అందంతో పాటు నటనతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమా సూపర్ సక్సెస్ కావడంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ టాలీవుడ్ ఇండస్ట్రీలో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. దీంతో ఈమె ప్రస్తుతం ఏ చిత్రాల్లో నటిస్తుందో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో బాగా నెలకొంది. తాజాగా ఈమె తాను నటిస్తున్న చిత్రాల గురించి వెల్లడించింది. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఓ సిరీస్‌లో నటిస్తున్నట్లు తెలిపింది. అలాగే కిరణ్ అబ్బవరం హీరోగా రూపొందుతున్న ఓ మూవీతో పాటు, తిరువీర్‌తో కలిసి మరో సినిమాలో కూడా నటిస్తున్నట్లు చెప్పింది. ఇలా మొత్తం మూడు ప్రాజెక్టులతో చాలా బిజీగా ఉన్నట్లు ఈ బ్యూటీ వెల్లడించింది.

## విచిత్ర
### మే 22న హార్రర్ త్రిల్లర్ చిత్రం



జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో, రవి, శ్రేయ తివారి హీరో హీరోయిన్ గా సిస్ ఫిలిమ్స్ బ్యానర్ పై సైపుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వం లో వస్తున్నా చిత్రం 'విచిత్ర', ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ సెన్సర్ పనులు పూర్తి చేసుకుని మే 22న విడుదల కానుంది.

ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైపుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ మా విచిత్ర మూవీ లో హీరోగా రవి, హీరోయిన్ శ్రేయ తివారి, జ్యోతి పూర్వరాజ్, 'బేబీ' శ్రీ హర్షిణి, రవి ప్రకాష్, సూర్య, ఛత్రపతికి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలుగా నటించిన చిత్రం "విచిత్ర"

"ప్రపంచం మొత్తం దూరమైన దగ్గరగా ఉండేది అమ్మ ప్రేమే" ప్రతి ఆడతల్లి గుండె తల్లడెల్లేలా సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన సినిమా "విచిత్ర", ఫ్యామిలీ తో కలిసి సంతోషంగా ఎంజాయ్ చేస్తూ, చూసే చిత్రం "విచిత్ర".

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.